# విశాల భారతి

2-02-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 31




# నిర్మలమ్మ బడ్జెట్ హాంఫట్..!

మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టారు

బడ్జెట్‌తో స్టాక్ మార్కెట్ కుప్పకూలిపోయింది

నిఫ్టీ కూడా 700 పాయింట్ల మేర నష్టపోయింది

సామాన్య పెట్టుబడిదారుల సంపద ఆవిరైపోయింది

రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించి స్పష్టత రావాల్సి ఉంది

రక్షణ శాఖకు రూ. 5,94,585 కోట్లు కేటాయించింది

విశాలభారతి, స్టేట్ బ్యూరో: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ అటు ఆశలను, ఇటు ఆందోళనలను కలిగించింది. ఆదివారం సెలవు దినమైనప్పటికీ, బడ్జెట్ ప్రసంగం నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు ప్రత్యేకంగా ట్రేడింగ్‌కు సిద్ధమయ్యాయి. పెట్టుబడిదారులు ఎంతో ఉత్కంఠతో ఎదురుచూసిన ఈ ఆర్థిక పద్దు చివరకు దలాల్ స్ట్రీట్‌ను నిలువునా ముంచేసింది. ముఖ్యంగా ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై కేంద్రం ఊహించని రీతిలో పన్నుల భారాన్ని మోపడంతో మార్కెట్ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఇన్వెస్టర్ల ఆశలు నీరుగారుస్తూ సెన్సెక్స్ ఏకంగా 2,000 పాయింట్లు పతనం కాగా, నిఫ్టీ కూడా 700 పాయింట్ల మేర నష్టపోయింది. ఈ భారీ కుదుపుతో ప్రముఖ కంపెనీల షేర్లు నేలచూపులు చూడటంతో సామాన్య పెట్టుబడిదారుల సంపద ఆవిరైపోయింది.

మిగతా 3లో..





## తెలంగాణ ఏం తప్పు చేసింది?

- బడ్జెట్‌పై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు
- రాష్ట్ర అవసరాలను పరిగణనలోకి తీసుకోకపోవడం దారుణం
- ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు అండగా ఉంటుందని ఆశించాం
- కొత్త కెమికల్ పార్కుల జాబితాలో చోటు దక్కలేదు
- రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా వ్యవహరిస్తోంది
- పాత వివక్షను మరోసారి బడ్జెట్ సాక్షిగా బయటపెట్టుకుంది

04

## దేశాభివృద్ధికి బడ్జెట్ దిక్సూచి



04

- కేంద్ర బడ్జెట్‌ను ఎంపీ ఈటల రాజేందర్ ప్రశంసించారు
- ప్రజల హితమే పరమావధిగా ముందుకు సాగుతోందన్నారు
- సామాన్యుడి జీవితంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని ధీమా
- గ్రామీణ భారతంపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందని వెల్లడి
- రూ.1.50 లక్షల కోట్ల నిధులను కేటాయించడం శుభపరిణామం
- స్టార్టప్ రంగానికి పెద్దపీట వేశారని కొనియాడారు





# తెలంగాణ ఆశలపై కేంద్రం నీళ్లు

## కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి తీరని నిరాశనే మిగిల్చింది

### 47 కీలక అంశాలపై కేంద్రం స్పష్టత ఇవ్వలేదు

### విభజన హామీలపై తీవ్ర అన్యాయం చేసింది

రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్ట్ అంశాన్ని ప్రస్తావించలేదు

హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు మొండిచేయి

వరంగల్ నగరాభివృద్ధిపై కేంద్రం కన్ను విప్పలేదు

బయ్యారం ఉక్కు పరిశ్రమ అంశం మరోసారి అటకెక్కింది

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు ప్రత్యేక గుర్తింపు దక్కలేదు

విద్య ,వైద్య రంగాల్లోనూ తెలంగాణకు తీరని అన్యాయం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

దేశ రాజధాని వేదికగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన 202627 వార్షిక బడ్జెట్ తెలంగాణ రాష్ట్రానికి తీరని నిరాశనే మిగిల్చింది. ఎన్నో ఆశలతో, కోటి ఆకాంక్షలతో ఎదురుచూసిన రాష్ట్ర ప్రజలకు ఈ బడ్జెట్ ప్రసంగం ఒక చేదు అనుభవంలా మారింది. సుమారు 12 శాఖలకు సంబంధించిన 47 కీలక అంశాలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ముందు ఉంచినప్పటికీ, అందులో ఏ ఒక్క ప్రధాన డిమాండ్‌కు కూడా స్పష్టమైన నిధుల కేటాయింపులు జరగకపోవడం గమనార్హం. విభజన హామీల అమలులో కేంద్రం తన ఉదాసీన వైఖరిని ఈసారైనా వీడుతుందని ఆశించిన తెలంగాణకు, మళ్లీ అన్యాయమే జరిగిందని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా మార్చే క్రమంలో మౌలిక సదుపాయాల కల్పన ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. ఇందులో భాగంగా రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టు రాష్ట్రానికి అత్యంత ప్రాధాన్యత కలిగినది. సుమారు 34 వేల కోట్లకు పైగా వ్యయంతో కూడుకున్న ఈ భారీ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తేనే పనులు వేగవంతం అవుతాయి. అయితే ఈ బడ్జెట్‌లో ఆ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రత్యేక నిధుల ప్రస్తావనే లేదు. దీనికి తోడు ఔటర్ రింగ్ రోడ్ నుంచి రీజినల్ రింగ్ రోడ్ వరకు అనుసంధానం చేసే రేడియల్ రోడ్ల కోసం తెలంగాణ ప్రభుత్వం

మిగతా 3లో..

# నాడు రేవంత్.. నేడు కేసీఆర్

## సీఎం రేవంత్ రెడ్డి గతంలో ఓటుకు నోటు కేసులో విచారణ

- కేసీఆర్‌ను విచారణకు నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు
- ఏ కేసులో అయినా విచారణ ప్రాథమికం
- విచారణ లేకుండా అసలు కేసులు ఉండవు
- ఏం జరిగిందో తేల్చేందుకు విచారణే ముఖ్యం
- ఈ విషయంలో ఎవరినీ తప్పబట్టాల్సిన అవసరం లేదు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఏదైనా ఒక వివాదం లేదా నేరం జరిగినప్పుడు సత్యనిరూపణ కావాలంటే విచారణ అనేది అత్యంత ప్రాథమికమైన ప్రక్రియ. చట్టం దృష్టిలో ఎవరైనా సమానులే అన్న సూత్రం ప్రకారం, విచారణ లేకుండా ఏ కేసూ ఒక కొలిక్కి రాదు. అసలు ఏం జరిగింది, బాధ్యులెవరు అన్న విషయాలు తేలాలంటే దర్యాప్తు సంస్థల ప్రశ్నలకు సమాధానం చెప్పడం తప్పనిసరి. అయితే, ప్రస్తుత రాజకీయాల్లో ఈ విచారణ ప్రక్రియ కూడా ఒక ఆయుధంగా మారుతోంది. గతంలో ఒకరు అనుసరించిన వైఖరిని నేడు మరొకరు ప్రశ్నిస్తుండగా, నాడు విమర్శించిన వారే నేడు అదే తరహా ఆందోళనలకు దిగడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో ఓటుకు నోటు కేసు విచారణ సందర్భంలో అప్పటి రాజకీయ పరిణామాలను గమనిస్తే ప్రస్తుత పరిస్థితికి పూర్తి భిన్నంగా ఉండేవి. ఆనాడు రేవంత్ రెడ్డిని విచారణకు పిలిచినప్పుడు తెలుగుదేశం పార్టీ శ్రేణులు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చాయి.

మిగతా 2లో..



నాడు రేవంత్‌రెడ్డి



నేడు కేసీఆర్

# సుప్రీం అంటే మీరేనా..?

- ఫోన్ ట్యాపింగ్ కేసు ఇప్పుడు కీలక మలుపు తిరిగింది
- కేసీఆర్‌ను సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు
- ఆయన నివాసంలోనే ఈ విచారణ ప్రక్రియ కొనసాగింది
- నాలుగున్నర గంటల పాటు అత్యంత గోప్యంగా సాగింది
- పక్కా ప్రణాళికతో కేసీఆర్ నివాసానికి చేరుకున్నారు
- గతంలో నమోదైన స్టేట్‌మెంట్‌లకు వివరణ కోరారు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ఆదివారం అత్యంత కీలక ఘట్టానికి చేరుకుంది. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును ప్రత్యేక దర్యాప్తు బృందం సుదీర్ఘంగా విచారించింది. హైదరాబాద్ నందినగర్‌లోని ఆయన నివాసంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమైన ఈ విచారణ దాదాపు నాలుగున్నర గంటల పాటు కొనసాగింది. దర్యాప్తునకు అవసరమైన కీలక పత్రాలు, సాక్ష్యాధారాలతో వచ్చిన ఆరుగురు అధికారుల బృందం, కేసీఆర్ నుంచి వివరణ కోరుతూ ప్రశ్నల వర్షం కురిపించింది. దర్యాప్తు ప్రక్రియ మొత్తాన్ని అధికారులు ఆడియో, వీడియో రికార్డింగ్ చేయడం గమనార్హం. గతంలో అరెస్టయిన నిందితులు ఇచ్చిన వాంగ్మూలాలను కేసీఆర్ ముందు ఉంచి,

మిగతా 2లో..



# హైదరాబాద్ ఊపిరి ఆగుతోంది

- హైదరాబాద్ నగరానికి నిశ్శబ్ద మృత్యువు పొంచి ఉంది
- మన ఊపిరితిత్తుల లోతుల్లోకి నెమ్మదిగా పాకుతోంది
- హైదరాబాద్ గాలి సైలెంట్‌గా విషంగా మారుతోంది
- శాస్త్రీయ పరిభాషలో దీని పేరు సల్ఫర్ డయాక్సైడ్
- పీల్చుకునే గాలిలో విషపూరిత వాయువులున్నాయి
- ఔటర్ రింగ్ రోడ్ చుట్టూ భయంకరమైన వాయు కాలుష్యం




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్.. భాగ్యనగరం. నిన్నటి దాకా ఇది కేవలం ఐటీ హబ్, బిర్యానీ ఘుమఘుమలు, విశ్వనగరంగానే మనకు తెలుసు. కానీ, ఇప్పుడు ఆ మెరుపుల వెనుక ఒక నిశ్శబ్ద మృత్యువు పొంచి ఉంది. అది మనకు కంటికి కనిపించదు, ముక్కుకు వాసన కూడా తెలియదు. కానీ మనం పీల్చే ప్రతి శ్వాసతో అది మన ఊపిరితిత్తుల లోతుల్లోకి నెమ్మదిగా పాకుతోంది. హైదరాబాద్ గాలి ఇప్పుడు మనుషులను సైలెంట్‌గా చంపే ఒక అదృశ్య ఆయుధంగా మారుతోంది. ఇది కేవలం మంచు కాదు, సాధారణ కాలుష్యం అంతకంటే కాదు. ఇది ఒక నెమ్మదిగా పనిచేసే విషం. శాస్త్రీయ పరిభాషలో దీని పేరు సల్ఫర్ డయాక్సైడ్, క్లుప్తంగా SO2. నగరంలో రోడ్ల మీద వేల సంఖ్యలో వాహనాలు పరుగులు తీస్తున్నాయి, ఆకాశాన్ని తాకేలా భవనాలు వెలుస్తున్నాయి. ఈ అభివృద్ధిని చూసి మనం మురిసిపోతుంటే, దాని నీడలోనే ఒక చీకటి సత్యం దాగి ఉంది. మనం పీల్చుకునే గాలిలో విషపూరిత వాయువులు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌ను చుట్టుముట్టి ఉన్న ఔటర్ రింగ్ రోడ్ ప్రాంతాలు ఇప్పుడు ఈ భయంకరమైన వాయు కాలుష్యానికి కేంద్ర బిందువులుగా మారుతున్నాయి. వాహనాల నుంచి వెలువడే పొగ, పరిశ్రమల నుంచి వచ్చే ఉద్గారాలు కలిసి మన ప్రాణవాయువును విషతుల్యం చేస్తున్నాయి. దీని ప్రభావం ఒక్క రోజులో తెలియకపోవచ్చు, కానీ దీర్ఘకాలంలో ఇది మనల్ని శ్వాసకోశ వ్యాధుల ఊబిలోకి నెట్టేస్తోంది. హైదరాబాద్ ఎయిర్ క్వాలిటీపై ఐఐటీ కాన్పూర్ చేపట్టిన అధ్యయనం కళ్లు బైర్లు కమ్మే నిజాలను బయటపెట్టింది. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు జరిగిన ఈ పరిశోధనలో నగరంలోని గాలి ఏ స్థాయిలో కలుషితమైందో శాస్త్రీయంగా విశ్లేషించారు. ఈ అధ్యయన నివేదిక ప్రకారం నగర శివార్లలో పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉంది. ముఖ్యంగా ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో రోజుకు సగటున 18,101 కిలోల సల్ఫర్ డయాక్సైడ్ గాలిలో కలుస్తోంది. అదే సమయంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 10,701 కిలోల SO2 ఉద్గారాలు నమోదవుతున్నాయి. అంటే మనం నివసించే పరిసరాల్లో ఇంత పెద్ద ఎత్తున విషం నిరంతరం విడుదలవుతోందన్నమాట. అయితే ఈ కాలుష్య మూలాల విషయంలో నగరానికి, శివార్లకు మధ్య ఒక ఆసక్తికరమైన, భయంకరమైన తేడా ఉంది. జీహెచ్ఎంసీ పరిధిలో విడుదలవుతున్న SO2లో దాదాపు 91 శాతం కేవలం వాహనాల నుంచే వస్తోంది. అంటే మనం నిత్యం రోడ్ల మీద వాడే కార్లు, బైకులు, బస్సులు ఈ విషాన్ని మన ముక్కుల దగ్గరకు చేరుస్తున్నాయి. కానీ ఔటర్ రింగ్ రోడ్ పరిసరాల్లో కథ వేరేలా ఉంది. అక్కడ 92 శాతం కాలుష్యం కేవలం పరిశ్రమల నుంచే వస్తోంది. అంటే నగర మధ్యలో వాహనాలు గాలిని చెడగొడుతుంటే, నగర శివార్లలో పరిశ్రమలు మన ఊపిరిని మింగేస్తున్నాయి. ఎటు చూసినా గాలిలో గరళమే నిండిపోతోంది.

సల్ఫర్ డయాక్సైడ్ అనేది ఒక సాధారణ కాలుష్య కారకం మాత్రమే కాదు. బొగ్గు, డీజిల్ వంటి శిలాజ ఇంధనాలను మండించినప్పుడు ఇది పెద్ద ఎత్తున ఉత్పత్తి అవుతుంది. ఇది శరీరంలోకి ప్రవేశించినప్పుడు శ్వాసనాళాల్లో తీవ్రమైన మంటను కలిగిస్తుంది. దీని వల్ల ఊపిరితిత్తుల వాపు రావడం, ఆస్థమా బాధితులకు పరిస్థితి విషమించడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఈ గాలిని పీల్చడం వల్ల తీవ్ర ఆరోగ్య సంక్షోభంలో పడే ప్రమాదం ఉంది. ఇది కేవలం మనుషుల మీద మాత్రమే కాదు, ప్రకృతి మీద కూడా తన ప్రతాపాన్ని చూపిస్తోంది.

వాతావరణంలోని తేమతో సల్ఫర్ డయాక్సైడ్ కలిసినప్పుడు అది సల్ఫ్యూరిక్ యాసిడ్‌గా మారి ఆమ్ల వర్షాలకు దారితీస్తుంది. దీనివల్ల భూమి సారం దెబ్బతినడమే కాకుండా పంటలు పాడైపోతాయి, పచ్చని చెట్లు సైతం ఎండిపోతాయి. అంటే మనం పీల్చే గాలి మనల్ని చంపడమే కాకుండా, మనం తినే ఆహారాన్ని, మన చుట్టూ ఉన్న పర్యావరణాన్ని కూడా నాశనం చేస్తోంది. భాగ్యనగరం ఇప్పుడు ఒక గ్యాస్ ఛాంబర్‌గా మారుతోందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వం తక్షణ చర్యలకు ఉపక్రమించడం కొంత ఊరటనిచ్చే అంశం. తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే నగరవ్యాప్తంగా ఎయిర్ క్వాలిటీ డ్యాష్‌బోర్డ్స్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. గాలి నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు మానిటరింగ్ స్టేషన్ల సంఖ్యను పెంచారు. 2024 నాటికే సుమారు 40 కొత్త స్టేషన్లను అందుబాటులోకి తెచ్చి రియల్ టైమ్ డేటాను సేకరిస్తున్నారు. కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేకంగా క్లీన్ ఎయిర్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే భారీ పరిశ్రమలను నగరం దాటి దూరంగా తరలించడం, పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించడం వంటి చర్యలు చేపడుతున్నారు.

అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసే డ్యాష్‌బోర్డులు, చూపే గణాంకాలు మాత్రమే మన ఊపిరిని కాపాడలేవు. ఎందుకంటే ఈ కాలుష్యం అనేది నెమ్మదిగా మన రక్తంలో చేరుతోంది. మనకు తెలియకుండానే మనం ఒక విష వలయంలో చిక్కుకుపోతున్నాం. నగరాభివృద్ధి అంటే కేవలం ఫ్లైఓవర్లు, మెట్రో రైళ్లు మాత్రమే కాదు, పీల్చే గాలి కూడా స్వచ్ఛంగా ఉండాలి. వాహనాల వాడకాన్ని తగ్గించడం, ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపడం, పచ్చదనాన్ని పెంచడం వంటివి సామాజిక బాధ్యతగా మారాలి. లేదంటే రేపటి తరానికి మనం ఇచ్చే ఆస్తి కేవలం రోగాల పుట్ట మాత్రమే అవుతుంది.

హైదరాబాద్‌లోని ఈ నిశ్శబ్ద విషం ఒక్కసారిగా తన ప్రభావాన్ని చూపదు. అది మన దేహాన్ని క్రమంగా బలహీనపరుస్తూ లోపలి నుంచి దెబ్బతీస్తుంది. గాలిలో నిండిన ఈ సల్ఫర్ డయాక్సైడ్ ఇప్పుడు మన జీవనశైలిలో ఒక భాగమైపోయింది. మనం ట్రాఫిక్ జామ్‌ల గురించి, ఆఫీసు టెన్షన్ల గురించి ఆందోళన చెందుతాం కానీ, అదే సమయంలో మన ఊపిరితిత్తుల్లోకి వెళ్తున్న విషం గురించి పట్టించుకోము. ఈ అశ్రద్ధే భవిష్యత్తులో తీరని నష్టాన్ని కలిగిస్తుంది. గాలి నాణ్యత పడిపోవడం అనేది కేవలం పర్యావరణ సమస్య కాదు, అది ఒక మానవ మనుగడ ప్రశ్న. హైదరాబాద్ గాలిలో జీవించడమంటే ఇప్పుడు ఒక పోరాటం చేయడమే. ఈ పోరాటం కాలుష్యానికి వ్యతిరేకంగా, మన ఆరోగ్యం కోసం. అభివృద్ధి పేరుతో మనం చేసుకుంటున్న స్వయంకృతాపరాధం మనల్ని ఊపిరి ఆడకుండా చేస్తోంది. ప్రభుత్వాలు నియమాలు మారుస్తుండవచ్చు, టెక్నాలజీ పెరుగుతుండవచ్చు, కానీ స్వచ్ఛమైన గాలిని సృష్టించడం మాత్రం మన చేతుల్లోనే ఉంది. ఈ విషపూరిత వలయం నుంచి బయటపడకపోతే, భాగ్యనగరం భవిష్యత్తులో శ్వాస తీసుకోవడానికే భయపడే నగరంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. మేల్కోవాల్సిన సమయం ఆసన్నమైంది, లేదంటే రేపటి శ్వాస మరింత భారమవుతుంది.

# కేసీఆర్ చిల్లర రాజకీయాలకు వణకడు

- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సిట్ ఎదుట హాజరయ్యారు
- దీంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది
- కేటీఆర్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు
- కాలమే సమాధానం చెబుతుందని హెచ్చరించారు
- చిల్లర రాజకీయాలతో భయపెట్టలేరని కేటీఆర్ స్పష్టం
- కాంగ్రెస్ తీరు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని విమర్శించారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును సిట్ అధికారులు విచారించిన నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఈ పరిణామాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్న రాజకీయ శక్తులకు కాలమే సమాధానం చెబుతుందని హెచ్చరించారు. ఢిల్లీ పీఠాల ఒత్తిళ్లకు ఏనాడూ తలొగ్గని అరుదైన వ్యక్తిత్వం కేసీఆర్‌ది అని, అటువంటి నాయకుడిని ఇలాంటి చిల్లర రాజకీయాలతో భయపెట్టలేరని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన సుదీర్ఘ పోరాటంలో కేసీఆర్ పోషించిన పాత్ర అద్వితీయమని కేటీఆర్ కొనియాడారు. సుమారు రెండు దశాబ్దాల పాటు సాగిన మలిదశ ఉద్యమంలో ఒక్క సెకను కాలం కూడా ఆయన తన లక్ష్యం నుంచి పక్కకు తప్పుకోలేదని గుర్తు చేశారు. చావు నోట్లోకి వెళ్లి తెలంగాణను సాధించిన ధీశాలి కేసీఆర్ అని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్ని కష్టాలు ఎదురైనా పర్వతంలా నిలబడతారే తప్ప వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కేసీఆర్ ఒక వ్యక్తి కాదు, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపమని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

ప్రస్తుత పాలకుల తీరును తప్పుబడుతూ కేటీఆర్ ఘాటు విమర్శలు చేశారు. మూర్ఖులు చరిత్రను సృష్టించడం పక్కన పెడితే, కనీసం చరిత్రను సరిగ్గా అర్థం కూడా చేసుకోలేరని ఎద్దేవా చేశారు. కేసీఆర్ లాంటి యోధుడిని విచారణల పేరుతో వేధించడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎందరో నాయకులు కేసీఆర్‌పై విషం చిమ్మారని, కుట్రలు పన్నారని, కానీ వారెవ్వరూ ఆయన్ను ఏమీ చేయలేకపోయారని గుర్తు చేశారు. నేడు కూడా అదే పునరావృతం అవుతుందని, కేసీఆర్ అజేయుడని ఆయన పునరుద్ఘాటించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని కేటీఆర్ విమర్శించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ విచారణలు సాగుతున్నాయని ఆరోపించారు. తెలంగాణ కోసం సర్వస్వం ధారపోసిన నాయకుడిపై బురదజల్లడం ద్వారా లబ్ధి పొందాలని చూడటం రేవంత్ రెడ్డి అవివేకమని మండిపడ్డారు. కేసీఆర్ అంటే తెలంగాణ చరిత్ర అని, ఆ చరిత్రలో ప్రస్తుత పాలకులు కనీసం ఒక చిన్న ఫుట్‌నోట్ కూడా కాలేరని ఎద్దేవా చేశారు. ఎంతటి దుష్ట శక్తులు ఏకమైనా కేసీఆర్ సంకల్పాన్ని అణచివేయలేవని ధీమా వ్యక్తం చేశారు.

తెలంగాణ గడ్డపై కేసీఆర్ వేసిన ముద్ర చెరిగిపోనిదని, ఆయన చేసిన అభివృద్ధి పనులు ప్రతి పల్లెలోనూ కనిపిస్తాయని కేటీఆర్ వివరించారు. అధికార గర్వంతో విర్రవీగుతున్న వారు వాస్తవాలను గ్రహించాలని సూచించారు. ఉద్యమ కాలం నుంచి కేసీఆర్ ఎదుర్కొని సవాళ్లు లేవని, జైళ్లు, కేసులు ఆయనకు కొత్త కాదని పేర్కొన్నారు. ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న నాయకుడిని విచారణల పేరుతో మానసికంగా వేధించలేరని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు తమ పద్ధతి మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేటీఆర్ పిలుపునిచ్చారు. న్యాయం ఎప్పుడూ కేసీఆర్ వైపే ఉంటుందని, నిజం నిలకడ మీద తెలుస్తుందని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎండగట్టడంలో వెనక్కి తగ్గేది లేదని భీష్మించారు. కేసీఆర్ విచారణకు సహకరించడం ఆయనకు చట్టంపై ఉన్న గౌరవానికి నిదర్శనమని, అంతేకానీ దానిని బలహీనతగా భావించవద్దని హెచ్చరించారు. అక్రమ కేసులతో నాయకులను లొంగదీసుకోవాలని చూడటం కాంగ్రెస్ పాత నైజమని విమర్శించారు.

కేసీఆర్ శక్తి ఏమిటో తెలంగాణ సమాజానికి బాగా తెలుసని కేటీఆర్ అన్నారు. నీచమైన ఎత్తుగడలు, రాజకీయ కుతంత్రాలకు కేసీఆర్ వణికిపోయే వ్యక్తి కాదని, ఆయన ఒక పోరాట యోధుడని కొనియాడారు. ఒకనాడు ఒంటరిగా బయలుదేరి కోట్లాది మందిని ఏకం చేసి రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తికి ఇలాంటి విచారణలు లెక్కలోకి రావని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధిని కుంటుపరచాలని చూస్తున్న శక్తులపై నిరంతరం పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలో జరుగుతున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఈ రాష్ట్రం కోసం కేసీఆర్ పడిన ఆరాటం, చేసిన త్యాగం వెలకట్టలేనివని కేటీఆర్ తెలిపారు. అధికారం ఉన్నా లేకపోయినా కేసీఆర్ ఆలోచన ఎప్పుడూ తెలంగాణ బాగు కోసమే ఉంటుందని చెప్పారు. ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నిస్తున్నందుకే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కేసీఆర్ మీద ఎంత విషం చిమ్మినా ఆయన చుట్టూ ఉన్న ప్రజా కవచాన్ని దాటి ఏమీ చేయలేరని హెచ్చరించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, కానీ నైతికతను కోల్పోయి వ్యవహరించడం సరికాదని హితవు పలికారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని ఎండగడుతూ కేటీఆర్ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పక్క రాష్ట్రాల మెప్పు కోసం, ఢిల్లీ పెద్దల సంతోషం కోసం తెలంగాణ బిడ్డలపై కక్ష కట్టడం తగదని అన్నారు. కేసీఆర్ అనే మహా వృక్షాన్ని కూల్చడం ఎవరి తరమూ కాదని, ఆయన వేర్లు ఈ మట్టిలో చాలా లోతుగా ఉన్నాయని గుర్తు చేశారు. చిల్లర రాజకీయాలకు కాలం చెల్లిందని, ఇప్పటికైనా పాలనపై దృష్టి సారించాలని సూచించారు. కేసీఆర్‌ను ఇబ్బంది పెడితే తెలంగాణ ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలంగా పుంజుకుంటుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పార్టీ శ్రేణులన్నీ ఏకతాటిపై నిలబడాలని కోరారు. సత్యం జయిస్తుందని, కేసీఆర్ స్వచ్ఛమైన నాయకత్వం మరోసారి రుజువవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఢిల్లీకి గులాంలుగా మారిన వారు తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అయిన కేసీఆర్‌ను ఏమీ చేయలేరని మరోసారి స్పష్టం చేస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

# సుప్రీం అంటే మీరేనా..?




**మొదటిపేజీ తరువాయి**

ఈ వ్యవహారంలో ఆయన ప్రమేయంపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుకు పదవీకాలం ముగిసినా ఎందుకు బాధ్యతలు అప్పగించారో తెలపాలని అధికారులు కోరారు. విచారణ సందర్భంగా నందినగర్ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భారీగా మోహరించిన పోలీసులు బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలను నివాసం పరిసరాల్లోకి రాకుండా అడ్డుకున్నారు. కేసీఆర్ వయస్సు, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆయన నివాసంలోనే విచారణ జరపాలని సిట్ నిర్ణయించింది. అంతకుముందు జనవరి 30నే హాజరు కావాలని నోటీసులు ఇచ్చినా, మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ దృష్ట్యా కేసీఆర్ గడువు కోరారు. దీంతో ఎట్టకేలకు ఆదివారం అధికారులు ఆయన స్టేట్‌మెంట్‌ను నమోదు చేశారు. విచారణ జరుగుతున్న సమయంలో కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావు వంటి ముఖ్య నేతలు ఇంట్లోనే ఉన్నట్లు సమాచారం. అధికారులు వెళ్లిపోయిన వెంటనే కేసీఆర్ పార్టీ ముఖ్యులతో అత్యవసర సమావేశం నిర్వహించి, విచారణలో ఎదురైన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

సిట్ అధికారులు అడిగిన ప్రశ్నల్లో 'సుప్రీం' లేదా 'పెద్దాయన' అన్న ప్రస్తావన ప్రధానంగా వినిపించింది. ఫోన్ ట్యాపింగ్ కార్యకలాపాలకు సంబంధించి క్షేత్రస్థాయి అధికారులకు నేరుగా ఆదేశాలు ఎవరి నుంచి అందాయన్న కోణంలో ప్రశ్నలు సాగాయి. రాజకీయ ప్రత్యర్థుల కదలికలను గమనించడానికి ఇంటెలిజెన్స్ విభాగం పరిమితికి మించి వ్యవహరించిందా, ఆ సమాచారాన్ని మీకు ఎప్పటికప్పుడు చేరవేసేవారా అని అధికారులు అడిగినట్లు సమాచారం. ముఖ్యంగా ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాప్ చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని, అది కేవలం భద్రతా కారణాలతోనే జరిగిందా లేక రాజకీయ ప్రయోజనాల కోసమా అని ఆరా తీశారు. ప్రభాకర్ రావు, రాధాకిషన్ రావు వంటి రిటైర్డ్ అధికారులను కీలక పోస్టుల్లో కొనసాగించడం వెనుక ఉన్న మతలబు ఏమిటని నిలదీసినట్లు తెలుస్తోంది.

ఈ కేసులో మరో సంచలన అంశం పార్టీ ఫండ్ వినియోగంపై తలెత్తింది. ఫోన్ ట్యాపింగ్ కోసం అత్యాధునిక పరికరాల కొనుగోలుకు ప్రభుత్వ నిధులు కాకుండా పార్టీ నిధులను మళ్లించారా అన్న కోణంలో సిట్ ప్రశ్నించింది. గతంలో జరిగిన ఎమ్మెల్యేల కొనుగోలు కేసుకు సంబంధించిన వీడియోలు, ఆడియోలు ప్రగతి భవన్‌కు ఎలా చేరుకున్నాయని, ఆ సమాచారం ట్యాపింగ్ ద్వారానే లభించిందా అని అధికారులు లోతుగా విచారించారు. అలాగే, బీఆర్ఎస్ పార్టీకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో విరాళాలు ఇచ్చిన వారి ఫోన్ నంబర్లు కూడా ట్యాపింగ్ జాబితాలో ఉండటంపై కేసీఆర్ నుంచి వివరణ కోరినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్న అసలు సూత్రధారి ఎవరన్నది నిర్ధారించేందుకు అధికారులు ప్రయత్నించారు.

ముఖ్యంగా పరిపాలనా నియమావళికి విరుద్ధంగా ఒకే వ్యక్తికి రెండు కీలక బాధ్యతలు ఎందుకు అప్పగించాల్సి వచ్చిందని కేసీఆర్‌ను అధికారులు ప్రశ్నించారు. కీలక నిందితులతో కేసీఆర్ వ్యక్తిగతంగా ఎప్పుడైనా మాట్లాడారా, ఫోన్ ట్యాపింగ్ డేటా ఎవరి ద్వారా చేతులు మారిందనే అంశంపై ఆయన ఇచ్చిన సమాధానాలను అధికారులు విశ్లేషిస్తున్నారు. రాజకీయ దురుద్దేశంతోనే ఈ తనిఖీలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా, చట్టం తన పని తాను చేసుకుపోతుందని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. కేసీఆర్ స్టేట్‌మెంట్ నమోదుతో ఈ కేసు దర్యాప్తు తదుపరి దశకు చేరుకుంది. విచారణ ముగిసిన తర్వాత కూడా బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున కేసీఆర్ నివాసానికి చేరుకోవడంతో నందినగర్ ప్రాంతం రాజకీయ కోలాహలంగా మారింది.

మరోవైపు, ఇప్పటికే నోటీసులు అందుకుని విచారణకు హాజరైన కేటీఆర్, హరీష్ రావుల వాంగ్మూలాలను కేసీఆర్ సమాధానాలతో సరిపోల్చే పనిలో సిట్ నిమగ్నమైంది. ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావును విదేశాల నుంచి రప్పించే ప్రయత్నాలు ముమ్మరం చేసిన తరుణంలో, కేసీఆర్ విచారణ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసేందుకు అధికార యంత్రాంగాన్ని వాడుకున్నారా అన్నది తేలాల్సి ఉంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బయటపడిన డిజిటల్ ఆధారాలను కేసీఆర్ ముందు ఉంచినప్పుడు ఆయన కొంత అసహనం వ్యక్తం చేసినట్లు కూడా రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఏదేమైనా, ఒక మాజీ ముఖ్యమంత్రిని ఆయన నివాసంలోనే సుదీర్ఘంగా విచారించడం రాష్ట్ర చరిత్రలో అరుదైన పరిణామంగా మిగిలిపోనుంది.

విచారణ ప్రక్రియ పూర్తయిన తర్వాత సిట్ అధికారులు ఆ నివేదికను నేరుగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్‌కు అందజేయనున్నారు. చట్టపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు న్యాయ నిపుణుల సమక్షంలోనే ఈ విచారణ సాగింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, ఎలక్టోరల్ బాండ్ల దాతల వ్యక్తిగత గోప్యతను కూడా ఉల్లంఘించినట్లు ఆధారాలు లభిస్తే కేసు మరిన్ని మలుపులు తిరిగే అవకాశం ఉంది. ఈ కేసులో తదుపరి చర్యలు ఎలా ఉంటాయన్న దానిపై యావత్ రాష్ట్రం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది. ఈ విచారణ ఫలితాలు త్వరలో రాబోయే రాజకీయ పరిణామాలకు దిశానిర్దేశం చేసేలా కనిపిస్తున్నాయి.

కేసీఆర్ నివాసం నుంచి సిట్ అధికారులు వెనుదిరిగిన తర్వాత బీఆర్ఎస్ శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన, మరోవైపు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తమవుతున్నాయి. ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం పాత కేసులను తిరగదోడుతోందని మాజీ మంత్రులు మండిపడుతున్నారు. అయితే, దర్యాప్తు సంస్థలు మాత్రం నిష్పక్షపాతంగా విచారణ జరుగుతోందని, తప్పు చేసిన వారు ఎవరైనా శిక్ష తప్పదని హెచ్చరిస్తున్నాయి. విచారణలో సేకరించిన ఆడియో, వీడియో రికార్డింగ్‌లు కోర్టులో కీలక సాక్ష్యాలుగా మారనున్నాయి. కేసీఆర్ ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్న అంశాలను ఫోరెన్సిక్ నివేదికలతో సరిచూసిన తర్వాత సిట్ తన తదుపరి కార్యాచరణను ప్రకటించే అవకాశం ఉంది.

రాష్ట్రవ్యాప్తంగా ఈ పరిణామంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఈ ట్యాపింగ్ వ్యవహారాన్ని ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడిగా అభివర్ణిస్తుండగా, బీఆర్ఎస్ మాత్రం తమ నేతను వేధించే ప్రయత్నంగా కొట్టిపారేస్తోంది. విచారణ ముగిసిన తర్వాత కేసీఆర్ ప్రశాంతంగా ఉన్నట్లు కనిపించినప్పటికీ, లోపల జరిగిన చర్చలు మాత్రం అత్యంత గంభీరంగా సాగినట్లు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని రాజకీయ అవసరాలకు ఏ విధంగా మళ్లించారనే దానిపై సిట్ బృందం పక్కా ఆధారాలు సేకరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో మరికొందరు కీలక నేతలకు నోటీసులు అందే అవకాశం కనిపిస్తోంది.

# నాడు రేవంత్.. నేడు కేసీఆర్

**మొదటిపేజీ తరువాయి**

దర్యాప్తు సంస్థల తీరును తప్పుబడుతూ ఆందోళనలు చేపట్టాయి. ఆ సమయంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకత్వం ఈ నిరసనలను తీవ్రంగా ఖండించింది. విచారణకు వెళ్లేందుకు ఎందుకు భయపడుతున్నారని, తప్పు చేయనప్పుడు ఉలికిపాటు ఎందుకని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ వేదికగా, బహిరంగ సభల్లో ఎద్దేవా చేసిన సందర్భాలు నేటికీ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. నాడు విచారణ ఎదుర్కోవడాన్ని ధైర్యంగా చూడాలని హితవు పలికిన నాయకులే, నేడు తమ విషయంలో దర్యాప్తు సంస్థలు నోటీసులు ఇస్తే మాత్రం దానిని రాజకీయ కక్షసాధింపుగా అభివర్ణిస్తున్నారు. కేవలం రేవంత్ రెడ్డి విషయంలోనే కాకుండా, గత పదేళ్లలో అనేక కేసుల్లో విచారణకు హాజరైన ప్రతిపక్ష నేతలను ఉద్దేశించి బీఆర్ఎస్ మంత్రులు నాడు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వారికే ఇబ్బందికరంగా మారుతున్నాయి. రాజకీయాల్లో విలువలు, విమర్శలు అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా మారుతున్నాయన్న విమర్శలు మేధావి వర్గం నుంచి వినిపిస్తున్నాయి. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కీలక దశకు చేరుకుంది. ఈ కేసులో విచారణ ఎదుర్కొనేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్ధమయ్యారు. సిట్ అధికారులు పంపిన నోటీసుల మేరకు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆయన విచారణకు హాజరయ్యారు. ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేపథ్యంలో, విచారణలో ఎలాంటి నిజాలు బయటపడతాయోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ఫోన్ ట్యాపింగ్ లాంటి సున్నితమైన అంశంలో స్వయంగా మాజీ ముఖ్యమంత్రినే విచారించడం అనేది రాష్ట్ర చరిత్రలో ఒక కీలక పరిణామంగా అభివర్ణించవచ్చు.

అయితే, ఈ విచారణను కేవలం చట్టపరమైన ప్రక్రియగా చూడకుండా రాజకీయ కోణంలో బీఆర్ఎస్ నేతలు విశ్లేషిస్తున్నారు. తమ అధినేతను విచారణకు పిలవడమే ఒక పెద్ద నేరమన్నట్లుగా వారి మాటలు కనిపిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ఎవరైనా విచారణకు అతీతులు కారని తెలిసినప్పటికీ, కేసీఆర్ వంటి సీనియర్ నాయకుడిని ఇలా ఇబ్బంది పెట్టడం సరికాదని వారు వాదిస్తున్నారు. విచారణ వెనుక కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కుట్ర దాగి ఉందని, అందుకే పనిగట్టుకుని విచారణల పేరుతో వేధిస్తున్నారని బీఆర్ఎస్ ముఖ్య నేతలు ఆరోపిస్తున్నారు.

ఈ పరిణామాల నేపథ్యంలో మాజీ మంత్రి కేటీఆర్ రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునివ్వడం రాజకీయంగా వేడిని పెంచింది. కేసీఆర్‌ను విచారణకు పిలవడాన్ని నిరసిస్తూ అన్ని మండల, జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. రేవంత్ రెడ్డి సర్కారు కావాలనే అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని, రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయడమే ధ్యేయంగా ప్రభుత్వం పావులు కదుపుతోందని, దీనిని ప్రజలందరూ గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

మరోవైపు, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతలపై జరిగిన దాడులు, విచారణల సమయంలో కేటీఆర్ మాట్లాడిన మాటలను నెటిజన్లు గుర్తు చేస్తున్నారు. ఆనాడు చట్టం తన పని తాను చేసుకుపోతుందన్న నేతలు, నేడు అదే చట్టం తమ వైపు వచ్చేసరికి అప్రజాస్వామికం అనడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. రాజకీయాల్లో ఈ ద్వంద్వ ప్రమాణాలు కొత్తేమీ కాకపోయినా, ఫోన్ ట్యాపింగ్ వంటి తీవ్రమైన కేసులో విచారణను అడ్డుకోవాలని చూడటం లేదా దానిని రాజకీయ రంగు పులమడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రభుత్వ వర్గాలు మాత్రం ఈ విచారణలో ఎక్కడా రాజకీయం లేదని స్పష్టం చేస్తున్నాయి. ఫోన్ ట్యాపింగ్ వల్ల సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు అందరి గోప్యతకు భంగం కలిగిందని, దీని వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరో తేలాల్సిందేనని కాంగ్రెస్ నేతలు వాదిస్తున్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వారు విచారణకు సహకరించాల్సింది పోయి, ఇలా రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు చేయడం విచారకరమని వారు పేర్కొంటున్నారు. ఎవరిని వేధించాలన్న ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదని, కేవలం నిజానిజాలు నిగ్గుతేల్చడమే తమ లక్ష్యమని ప్రభుత్వం చెబుతోంది.

ఆదివారం మధ్యాహ్నం జరగబోయే ఈ విచారణ తెలంగాణ రాజకీయాల్లో ఒక మైలురాయిగా నిలవనుంది. సిట్ అధికారులు అడిగే ప్రశ్నలకు కేసీఆర్ ఎలాంటి సమాధానాలు ఇస్తారు, ఈ విచారణ అనంతరం ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయోనన్న ఆందోళన పార్టీ కార్యకర్తల్లో ఉంది. ముఖ్యంగా నిరసనల పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే అవకాశం ఉండటంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటోంది. చివరగా, విచారణ అనేది నేరాన్ని నిరూపించేందుకు లేదా నిర్దోషిత్వాన్ని చాటుకునేందుకు ఒక వేదిక మాత్రమే. దీనిని రాజకీయ రణక్షేత్రంగా మార్చడం వల్ల అసలు కేసు పక్కదారి పట్టే అవకాశం ఉంటుంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా దర్యాప్తు సంస్థలు తమ పని తాము నిష్పక్షపాతంగా చేసుకుపోయే వాతావరణం ఉండాలి. రాజకీయ నాయకులు కూడా విచారణ ఎదుర్కోవడం అనేది ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమని గుర్తించినప్పుడే వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరుగుతుంది.





# తెలంగాణ ఆశలపై కేంద్రం నీళ్లు






**మొదటిపేజీ తరువాయి**

కోరిన 45 వేల కోట్ల రూపాయల ప్రతిపాదనలను కేంద్రం పూర్తిగా విస్మరించింది. నగర రవాణా ముఖ చిత్రాన్ని మార్చే హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు కూడా ఈ బడ్జెట్‌లో మొండిచేయి ఎదురైంది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని మెట్రో నెట్‌వర్క్‌ను శివారు ప్రాంతాలకు విస్తరించాలని రాష్ట్రం ఎప్పటి నుంచో పోరాడుతోంది. ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి ఆర్థిక తోడ్పాటు అందుతుందని ఆశించినా, నిధుల విడుదలలో ఎటువంటి కదలిక రాలేదు. దీంతో మెట్రో విస్తరణ పనులు మరింత ఆలస్యమయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఇది కేవలం రవాణా వ్యవస్థపైనే కాకుండా, నగరం వైపు వచ్చే కొత్త పెట్టుబడులపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. కేంద్రం ప్రదర్శిస్తున్న ఈ వివక్ష కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాలేదు. ఉత్తర తెలంగాణకు గుండెకాయ లాంటి వరంగల్ నగరాభివృద్ధిపై కూడా కేంద్రం కన్ను విప్పలేదు. వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణకు, మురుగు నీటి శుద్ధి ప్లాంట్లకు ప్రత్యేక గ్రాంట్లు కేటాయించాలని రాష్ట్రం కోరినా ఫలితం లేకుండా పోయింది. అలాగే 17 వేల కోట్లతో నిర్మించ తలపెట్టిన గ్రీన్ ఫీల్డ్ హైవేల నిర్మాణానికి సంబంధించి కూడా కేంద్ర బడ్జెట్‌లో స్పష్టత కొరవడింది. రాష్ట్రం చేస్తున్న అభివృద్ధి ప్రయత్నాలకు కేంద్రం నుంచి ఆశించిన సహకారం అందకపోవడం వల్ల ప్రాజెక్టుల వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంది.

పారిశ్రామిక రంగానికి వస్తే విభజన చట్టంలోని ప్రధాన హామీ అయిన బయ్యారం ఉక్కు పరిశ్రమ అంశం మరోసారి అటకెక్కింది. దశాబ్ద కాలంగా తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా వాసులు చేస్తున్న పోరాటంపై కేంద్రం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం శోచనీయం. సొంతంగా పరిశ్రమ స్థాపించే అవకాశం ఉన్నా, సాంకేతిక సాకులు చూపుతూ కేంద్రం దీనిని పక్కన పెడుతూ వస్తోంది. ఈ బడ్జెట్‌లోనైనా దీనిపై ప్రకటన వస్తుందని ఆశించిన కార్మిక వర్గాలకు నిరాశే మిగిలింది. ఇది రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి పెద్ద అడ్డంకిగా మారనుందని పారిశ్రామికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు కేంద్రం నుంచి ప్రత్యేక గుర్తింపు దక్కలేదు. నేతన్నలకు భరోసా ఇచ్చే ఈ పార్క్‌కు జాతీయ స్థాయి హోదా గానీ, భారీ ప్యాకేజీ గానీ ప్రకటించకపోవడం గమనార్హం. గతంలో ఇచ్చిన హామీలకే దిక్కులేని పరిస్థితుల్లో, కొత్తగా విమానాశ్రయాల ఏర్పాటుకు అనుమతులు వస్తాయన్న ఆశలు అడియాశలయ్యాయి. రాష్ట్రంలో కొత్తగా ప్రతిపాదించిన ఎయిర్‌పోర్టుల అభివృద్ధికి మౌలిక సదుపాయాల నిధులు కేటాయించడంలో కేంద్రం వెనకడుగు వేసింది. ఇది రాష్ట్ర పర్యాటక మరియు వాణిజ్య రంగాలకు పెద్ద దెబ్బ అని చెప్పాలి. రైల్వే బడ్జెట్‌లో సైతం తెలంగాణకు ఒరిగిందేమీ లేదు. రాష్ట్రానికి సంబంధించిన 8 కొత్త రైల్వే లైన్ల మంజూరు, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి రాష్ట్రం గట్టిగా కోరినప్పటికీ, కేంద్రం మాత్రం పాత కేటాయింపులతోనే సరిపెట్టింది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో తెలంగాణకు రావాల్సిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వంటి ప్రధాన ప్రాజెక్టుల ఊసే లేదు. కేవలం రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పేరుతో నామమాత్రపు నిధులు కేటాయించి, కీలకమైన మౌలిక ప్రాజెక్టులను కేంద్రం విస్మరించింది. ఇది తెలంగాణ రైల్వే ప్రయాణికులకు, రవాణా రంగానికి జరిగిన పెద్ద అన్యాయంగా భావించవచ్చు. సాగునీటి రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గోదావరిమూసీ నదుల అనుసంధానానికి సంబంధించి తెలంగాణ 6 వేల కోట్లు కోరగా, కేంద్రం నుంచి ఎటువంటి సానుకూల స్పందన రాలేదు. మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుకు కేంద్రం నుంచి గ్రీన్ ఫండ్స్ అందుతాయని ప్రభుత్వం భావించినా, బడ్జెట్ ప్రసంగంలో ఆ ఊసే లేదు. నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలో సాగునీటి కొరత తీర్చాలన్న లక్ష్యం కేంద్రం సహాయం లేనిదే పూర్తి కావడం కష్టమని నిపుణులు అంటున్నారు. జాతీయ హోదా విషయంలోనూ తెలంగాణ ప్రాజెక్టుల పట్ల కేంద్రం వివక్ష చూపుతూనే ఉంది. విద్య ,వైద్య రంగాల్లోనూ తెలంగాణకు తీరని అన్యాయం జరిగింది. రాష్ట్రంలో ఒక్క ఐఐఎం మంజూరు చేయాలని గత పదేళ్లుగా ప్రతి ప్రభుత్వం విన్నవిస్తున్నా కేంద్రం కనికరించడం లేదు. నవోదయ పాఠశాలల సంఖ్య పెంపుదల, కొత్త కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుపై తెలంగాణ విన్నపాలు మళ్లీ బుట్టదాఖలయ్యాయి. అలాగే గిరిజన విశ్వవిద్యాలయానికి సంబంధించిన నిధుల విడుదలపై కూడా స్పష్టత లేదు. రాష్ట్ర యువతకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించే ప్రతిష్ఠాత్మక సంస్థల ఏర్పాటులో కేంద్రం చూపుతున్న వివక్ష రాష్ట్ర భవిష్యత్తుపై ప్రభావం చూపుతోంది. రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా కేంద్రం ఈ బడ్జెట్‌ను రూపొందించిందని స్పష్టంగా కనిపిస్తోంది. రాబోయే కాలంలో ఎన్నికలు జరగనున్న తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలకు భారీగా నిధులు, ప్రాజెక్టులు కుమ్మరించిన కేంద్రం, తెలంగాణ వంటి ప్రగతిశీల రాష్ట్రం పట్ల మొండిచేయి చూపింది. దేశానికి అత్యధిక ఆదాయం అందిస్తున్న రాష్ట్రాల్లో ఒకటిగా ఉన్న తెలంగాణకు, తిరిగి ఇచ్చే నిధుల్లో ఇంతటి వివక్ష చూపడం సమాఖ్య స్ఫూర్తికే విరుద్ధమని రాష్ట్ర నాయకత్వం మండిపడుతోంది. పన్నుల వాటా పంపిణీలోనూ రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నది ఆర్థిక శాఖాధికారుల వాదన.



మొత్తానికి నిర్మలమ్మ బడ్జెట్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలపై చన్నీళ్లు చల్లింది. కేంద్రం నుంచి ఆశించిన మద్దతు లభించకపోవడంతో, ఇప్పుడు రాష్ట్రం తన సొంత వనరుల పైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది రాష్ట్ర సొంత బడ్జెట్ రూపకల్పనపై తీవ్ర ప్రభావం చూపనుంది. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల వేగం తగ్గకుండా ఉండాలంటే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు భారీగా అప్పులు చేయాల్సి రావచ్చు, లేదా నిధుల సర్దుబాటు కోసం కష్టపడాల్సి ఉంటుంది. కేంద్రం ఇచ్చిన ఈ షాక్ నుంచి కోలుకోవడం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు ఒక సవాల్‌గా మారనుంది. తెలంగాణ ప్రజల ఆశలు, ఆశయాలను విస్మరించిన ఈ బడ్జెట్ పట్ల రాష్ట్రవ్యాప్తంగా నిరసన వ్యక్తమవుతోంది. విభజన హామీలను తుంగలో తొక్కి, అభివృద్ధిలో పోటీ పడుతున్న రాష్ట్రాన్ని వెనక్కి నెట్టే ప్రయత్నం జరుగుతోందని స్థానిక నేతలు ఆరోపిస్తున్నారు. ఈ బడ్జెట్ కేటాయింపులపై తెలంగాణ ప్రభుత్వం పార్లమెంట్ లోపల, బయట తన గళాన్ని వినిపించేందుకు సిద్ధమవుతోంది. కేంద్రం తన వైఖరిని మార్చుకుని, సవరించిన అంచనాల్లోనైనా తెలంగాణకు న్యాయం చేస్తుందా లేక ఇదే వివక్షను కొనసాగిస్తుందో వేచి చూడాలి.



# నిర్మలమ్మ బడ్జెట్ హాంఫట్..!



**మొదటిపేజీ తరువాయి**

దేశ రక్షణ రంగానికి ఎప్పుడూ పెద్దపీట వేసే సంప్రదాయానికి ఈసారి స్వల్ప మార్పు చోటుచేసుకుంది. రక్షణ శాఖకు రూ. 5,94,585 కోట్లు కేటాయించగా, రవాణా రంగానికి అంతకంటే ఎక్కువగా రూ. 5,98,520 కోట్లు కేటాయించడం విశేషం. అంటే రక్షణ కంటే రవాణా వ్యవస్థ మెరుగుదలకే ప్రభుత్వం దాదాపు రూ. 3,935 కోట్లు అదనంగా వెచ్చించనుంది. దేశ మౌలిక సదుపాయాల కల్పనలో వేగం పెంచడమే లక్ష్యంగా నిర్మలమ్మ ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. రవాణా రంగం అభివృద్ధి చెందితేనే పారిశ్రామిక వృద్ధి సాధ్యమని భావించిన కేంద్రం, లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గించే దిశగా ఈ భారీ కేటాయింపులు చేపట్టింది.

ఈ బడ్జెట్‌లో రవాణా రంగానికి సంబంధించి అత్యంత కీలకమైన ప్రకటన ఏడు హైస్పీడ్ రైల్వే కారిడార్ల ఏర్పాటు. దేశంలోని ఏడు ప్రధాన నగరాలను అనుసంధానిస్తూ వీటిని నిర్మించనున్నారు. అదే విధంగా సెమీకండక్టర్ రంగానికి రూ. 40,000 కోట్లు కేటాయించి భారత్‌ను గ్లోబల్ చిప్ తయారీ కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం గట్టి పునాదులు వేసింది. ఏపీ, తమిళనాడు, కేరళ, ఒడిశా వంటి తీర ప్రాంత రాష్ట్రాల్లో అరుదైన ఖనిజాల కోసం ప్రత్యేకంగా 'రేర్ ఎర్త్ కారిడార్' ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడం వ్యూహాత్మక నిర్ణయంగా భావిస్తున్నారు. ఇది భవిష్యత్తులో ఎలక్ట్రానిక్ మరియు రక్షణ రంగాలకు అవసరమైన ముడి పదార్థాల సరఫరాలో స్వయం సమృద్ధిని తెచ్చిపెట్టనుంది.

తెలుగు రాష్ట్రాలకు, ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి ఈ బడ్జెట్‌లో బంపర్ ఆఫర్ లభించింది. కేంద్రం ప్రకటించిన ఏడు హైస్పీడ్ రైల్వే కారిడార్లలో ఏకంగా మూడు కారిడార్లు భాగ్యనగరానికే దక్కడం విశేషం. హైదరాబాద్ నుంచి పూణే, చెన్నై, బెంగళూరు నగరాలకు అత్యంత వేగంగా చేరుకునేలా ఈ మార్గాలను నిర్మించబోతున్నారు. ఈ ప్రాజెక్టుల వల్ల ఐటీ హబ్‌గా ఉన్న హైదరాబాద్‌కు రవాణా పరంగా కొత్త జవజీవాలు అందనున్నాయి. పొరుగున ఉన్న మెట్రో నగరాలతో అనుసంధానం పెరగడం వల్ల వ్యాపార, ఉపాధి అవకాశాలు మెరుగుపడి, దక్షిణ భారతదేశ ఆర్థిక వృద్ధిలో తెలంగాణ కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది.



సామాన్యుల ఆరోగ్యానికి, విద్యకు సంబంధించి బడ్జెట్‌లో కొన్ని ఊరటనిచ్చే అంశాలు చోటుచేసుకున్నాయి. ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధికి వాడే మందులతో పాటు డయాబెటిక్ ఔషధాల ధరలు తగ్గనున్నాయి. అలాగే పర్యావరణ హితమైన విద్యుత్ వాహనాల బ్యాటరీలు, సోలార్ ప్యానెల్స్ ధరలు కూడా దిగిరానున్నాయి. చెప్పులు, పాదరక్షల ధరలు కూడా తగ్గడంతో సామాన్యుడి జేబుపై భారం కొంత మేర తగ్గనుంది. వీటన్నింటికంటే ముఖ్యంగా విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు కేంద్రం అండగా నిలిచింది. విదేశీ విద్యా ఖర్చులపై రాయితీలు కల్పించడంతో విద్యార్థుల ఆర్థిక భారం తగ్గే అవకాశం ఏర్పడింది. పన్ను చెల్లింపుదారుల విషయంలో మాత్రం నిర్మలమ్మ ఈసారి కఠినంగానే వ్యవహరించారు. ఆదాయపు పన్ను స్లాబుల్లో మార్పులు ఉంటాయని, రాయితీలు లభిస్తాయని మధ్యతరగతి వర్గాలు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. గతంలో ప్రకటించిన విధానాలనే కొనసాగించడంతో కొత్తగా ఎటువంటి మినహాయింపులు లభించలేదు. పెరిగిన జీవన వ్యయంతో సతమతమవుతున్న వేతన జీవులకు ఈ నిర్ణయం కాస్త నిరాశ కలిగించేదే. పొదుపు పథకాలపై వడ్డీ రేట్ల పెంపు లేదా సెక్షన్ 80సీ పరిమితి పెంపు వంటి ప్రకటనలు వస్తాయని ఆశించిన వారు ఇప్పుడు పెదవి విరుస్తున్నారు.

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకుంటున్న నిర్ణయాలతో భారత వాణిజ్య, ఐటీ రంగాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఈ గ్లోబల్ సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వం భారీ ప్యాకేజీలు లేదా ప్రోత్సాహకాలు ప్రకటిస్తుందని పారిశ్రామిక వర్గాలు భావించాయి. కానీ నిర్మలమ్మ బడ్జెట్‌లో ఆ దిశగా ఎలాంటి విప్లవాత్మక నిర్ణయాలు కనిపించకపోవడం గమనార్హం. ఐటీ, ఆర్థిక రంగాల బలోపేతానికి మరిన్ని చర్యలు తీసుకోవాల్సి ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా దేశీయ పరిశ్రమలకు లభించే అండ అంతంతమాత్రంగానే ఉందనే వాదన వినిపిస్తోంది.

మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు వచ్చే కేటాయింపులపై స్పష్టత రావడానికి మరికొంత సమయం పట్టేలా ఉంది. హైస్పీడ్ రైల్వే వంటి భారీ ప్రాజెక్టులు ఒక ఎత్తయితే, విభజన హామీలు, ప్రత్యేక గ్రాంట్ల విషయంలో కేంద్రం ఎంతవరకు సానుకూలంగా ఉందో వివరాలు వెల్లడవుతున్నాయి. కేవలం పైపైన కనిపించే అంకెలను చూసి బడ్జెట్‌ను అంచనా వేయడం కంటే, క్షేత్రస్థాయిలో రాష్ట్రాలకు అందే నిధులపై లోతైన విశ్లేషణ అవసరమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల ప్రయోజనాలకు సంబంధించి పూర్తి స్థాయి స్పష్టత రావాల్సి ఉంది. మొత్తానికి నిర్మలమ్మ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ మిశ్రమ ఫలితాలను ఇచ్చింది. స్టాక్ మార్కెట్ కుప్పకూలడం ఇన్వెస్టర్ల నైతిక బలాన్ని దెబ్బతీయగా, రవాణా మరియు సెమీకండక్టర్ రంగాలకు ఇచ్చిన ప్రాధాన్యత భవిష్యత్తు వృద్ధిపై నమ్మకాన్ని కలిగిస్తోంది. మందుల ధరలు తగ్గడం, విద్యార్థులకు చేయూతనివ్వడం వంటి అంశాలు సామాన్యుడికి అనుకూలంగా ఉన్నాయి. అయితే పారిశ్రామిక వేత్తలు, మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులు ఆశించిన మేర ప్రభుత్వం స్పందించకపోవడం ఈ బడ్జెట్‌లోని ప్రధాన లోటుగా కనిపిస్తోంది. ఆర్థిక లోటును అదుపులో ఉంచుతూనే అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని ప్రభుత్వం ప్రయత్నించింది. కానీ పెరుగుతున్న ద్రవ్యోల్బణం, మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల మధ్య ఈ లక్ష్యాలు ఎంతవరకు నెరవేరుతాయో వేచి చూడాలి.

# తెలంగాణ ఏం తప్పు చేసింది?



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

దేశ రాజధాని వేదికగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 202627 బడ్జెట్ తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర నిరాశను మిగిల్చింది. ఈ బడ్జెట్ కేటాయింపులపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తామంతా స్వయంగా ఢిల్లీ వెళ్లి ప్రధానిని, కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర అవసరాలను వివరించినప్పటికీ, కేంద్రం ఒక్క విన్నపాన్ని కూడా పరిగణనలోకి తీసుకోకపోవడం దారుణమని ఆయన ధ్వజమెత్తారు. అసలు అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణ కేంద్రానికి ఏం తప్పు చేసిందని ఆయన సూటిగా ప్రశ్నించారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చే రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్ మెట్రో విస్తరణ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు కేంద్రం అండగా ఉంటుందని ఆశించామని, కానీ బడ్జెట్‌లో వాటి ఊసే లేకపోవడం వివక్షకు పరాకాష్ట అని భట్టి ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి ప్రాణవాయువు లాంటి మూసీ పునరుజ్జీవం కోసం భారీగా నిధులు కోరినప్పటికీ, కేంద్రం దానిని పూర్తిగా విస్మరించింది. ప్రపంచానికే ఫార్మా హబ్‌గా గుర్తింపు పొందిన హైదరాబాద్ నగరాన్ని కాదని, కేంద్రం ప్రకటించిన కొత్త కెమికల్ పార్కుల జాబితాలో తెలంగాణకు చోటు కల్పించకపోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

గతంలో కాంగ్రెస్ హయాంలో ఈసీఐఎల్ వంటి దిగ్గజ ప్రభుత్వ రంగ సంస్థలను హైదరాబాద్‌కు తీసుకువచ్చి నగరాన్ని పారిశ్రామికంగా బలోపేతం చేశామని భట్టి గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఉన్న సంస్థలను కాపాడటం పోయి, కొత్త వాటిని కేటాయించడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. కేవలం రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా కేంద్రం వ్యవహరిస్తోందని, తెలంగాణ పట్ల తనకున్న పాత వివక్షను మరోసారి బడ్జెట్ సాక్షిగా బయటపెట్టుకుందని ఆయన మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిందని, అయితే కేంద్రం స్పోర్ట్స్ విభాగంలోనూ తెలంగాణకు మొండిచేయి చూపిందని భట్టి విమర్శించారు. అఫోర్డబుల్ స్పోర్ట్స్ గూడ్స్ గురించి కేంద్ర విజన్ డాక్యుమెంట్‌లో తెలంగాణ పేరును ప్రముఖంగా ప్రస్తావించినప్పటికీ, బడ్జెట్ కేటాయింపులకు వచ్చేసరికి ఆ పేరు ఎక్కడా కనిపించలేదన్నారు. కేవలం మాటలకే పరిమితమై, చేతల్లో తెలంగాణను కేంద్రం దారుణంగా మోసం చేస్తోందని ఆయన నిప్పులు చెరిగారు.

హైదరాబాద్ సెంట్రిక్‌గా ఉండాల్సిన 'ఆరెంజ్ ఎకానమీ'ని కూడా ముంబైకి తరలించడం రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి పరాకాష్ట అని భట్టి పేర్కొన్నారు. తెలంగాణకు దక్కాల్సిన ఆర్థిక వనరులను, అవకాశాలను ఇతర రాష్ట్రాలకు తరలించడం ద్వారా రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప ఆలయం, కృష్ణాగోదావరి నదీ తీరాల్లోని అద్భుతమైన ఆధ్యాత్మిక క్షేత్రాలు, అటవీ సంపద ఉన్నా కూడా తెలంగాణ టూరిజాన్ని కేంద్రం ఈ బడ్జెట్‌లో పూర్తిగా విస్మరించడం శోచనీయమన్నారు.

వైద్య రంగంలోనూ రాష్ట్రానికి మొండిచేయి ఎదురైందని, కేంద్రం ప్రకటించిన రీజినల్ మెడికల్ హబ్‌ల జాబితాలో తెలంగాణ పేరు లేకపోవడం దారుణమని భట్టి విమర్శించారు. భవిష్యత్తు సాంకేతికత అయిన సెమీ కండక్టర్ల విషయంలో కేవలం 'పరిశీలిస్తాం' అన్న మాటే తప్ప, ఎటువంటి స్పష్టమైన ప్రకటన లేదా నిధుల కేటాయింపు లేదని మండిపడ్డారు. ఇది తెలంగాణ యువత ఉపాధి అవకాశాలను దెబ్బతీయడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్రం అనుసరిస్తున్న ఇటువంటి వైఖరి వల్ల దేశాభివృద్ధి కుంటుపడుతుందని హెచ్చరించారు.

కేంద్రం నిర్దేశించుకున్న 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనలో తాము కూడా భాగస్వామ్యం కావాలని మనస్ఫూర్తిగా అనుకున్నామని, కానీ తెలంగాణ వంటి ప్రగతిశీల రాష్ట్రాలను నిర్లక్ష్యం చేయడం వల్ల ఆ లక్ష్య సాధన సాధ్యం కాదని భట్టి స్పష్టం చేశారు. పేదల పాలిట వరమైన జాతీయ ఉపాధి హామీ పథకాన్ని జాబితా నుండి తొలగించే ప్రయత్నం చేస్తూ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కేంద్రం దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల సంక్షేమానికి కేంద్రం తూట్లు పొడుస్తోందని ఆయన ధ్వజమెత్తారు.

రాష్ట్ర అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా ఎంపీలందరూ ఏకతాటిపైకి రావాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. పార్లమెంట్‌లో తెలంగాణ గళాన్ని బలంగా వినిపించి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. తాము బాధ్యతాయుతమైన ప్రభుత్వంగా కేంద్రాన్ని పదేపదే కలుస్తూనే ఉంటామని, కానీ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రం కోసం పోరాటం చేస్తామని, కేంద్రం తన వివక్షా పూరిత వైఖరిని మార్చుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మొత్తానికి నిర్మలమ్మ బడ్జెట్ తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని, పన్నుల రూపంలో కేంద్రానికి భారీగా ఆదాయాన్ని సమకూర్చుతున్న రాష్ట్రానికి దక్కాల్సిన వాటా దక్కలేదని ఆర్థిక నిపుణులు కూడా అంగీకరిస్తున్నారు. విభజన హామీల అమలులో మొండిచేయి, కొత్త ప్రాజెక్టుల కేటాయింపులో శూన్యం వెరసి ఈ బడ్జెట్ తెలంగాణ పాలిట ఒక శాపంగా మారిందని భట్టి విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తన నిరసనను కేంద్రానికి గట్టిగా తెలియజేస్తుందని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా ఉన్న ఈ బడ్జెట్‌ను అంగీకరించే ప్రసక్తే లేదని, రాష్ట్రానికి జరగాల్సిన న్యాయం కోసం ఏ స్థాయికైనా వెళ్తామని భట్టి విక్రమార్క హెచ్చరించారు. కేంద్రం ప్రకటించిన అరకొర కేటాయింపులతో రాష్ట్ర ప్రగతి కుంటుపడదని, తమ శక్తి మేరకు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని భరోసా ఇచ్చారు. కానీ కేంద్రం తన బాధ్యతను విస్మరించి రాష్ట్రాన్ని ఇబ్బందులకు గురిచేయడం మాత్రం చరిత్రలో ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోతుందని ఆయన ముగించారు.

# దేశాభివృద్ధికి బడ్జెట్ దిక్సూచి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశాభివృద్ధిలో ఏమాత్రం రాజీ పడకుండా, సబ్బండ వర్గాల సంక్షేమాన్ని కాంక్షించేలా ఉందని బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రశంసించారు. సుమారు 53 లక్షల కోట్ల రూపాయలకు పైగా భారీ అంచనాలతో రూపొందించిన ఈ బడ్జెట్, దేశ ప్రజల హితమే పరమావధిగా ముందుకు సాగుతోందని ఆయన కొనియాడారు. ఆదివారం ఢిల్లీ వేదికగా మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఈటల, కేంద్ర నిర్ణయాల వల్ల సామాన్యుడి జీవితంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. గత బడ్జెట్‌లతో పోలిస్తే ఈసారి గ్రామీణ భారతంపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందని, తద్వారా పల్లెల రూపురేఖలు మారనున్నాయని ఆయన వివరించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం గత బడ్జెట్ కంటే అదనంగా రూ.1.50 లక్షల కోట్ల నిధులను కేటాయించడం శుభపరిణామమని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. వ్యవసాయం, మౌలిక వసతుల కల్పనలో ఈ నిధులు కీలక పాత్ర పోషిస్తాయని, తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ఆయన విశ్లేషించారు. దేశ జీడీపీ ఏడు శాతం వృద్ధిని నమోదు చేయాలనే లక్ష్యంతో కేంద్రం అడుగులు వేస్తోందని, అందులో భాగంగానే యువత, విద్యార్థుల నైపుణ్యానికి పదును పెట్టేలా స్టార్టప్ రంగానికి పెద్దపీట వేశారని కొనియాడారు. యువత కేవలం ఉద్యోగార్థులుగా కాకుండా, ఉద్యోగ ప్రదాతలుగా ఎదిగేలా ప్రోత్సాహకాలు అందించడం హర్షణీయమన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్న సత్యాన్ని గ్రహించిన మోదీ ప్రభుత్వం, వారిని ప్రోత్సహించేలా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుందని ఎంపీ ఈటల రాజేందర్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు, పరిశ్రమల స్థాపనకు ఊతమిచ్చేలా క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కోసం ఏకంగా 12 లక్షల కోట్ల రూపాయల నిధులు కేటాయించడం చారిత్రాత్మకమని ఆయన అభివర్ణించారు. ఈ భారీ పెట్టుబడుల వల్ల రవాణా, కమ్యూనికేషన్, పారిశ్రామిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతాయని, ఫలితంగా దేశవ్యాప్తంగా లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వైద్య రంగంలో సామాన్యులకు భరోసా కల్పించేలా కేంద్రం తీసుకున్న చర్యలను ఈటల ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశంలోని ప్రతి జిల్లాలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ట్రామా సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రమాద కాలంలో తక్షణ వైద్యం అందేలా ఈ కేంద్రాలు దోహదపడతాయని వివరించారు. ముఖ్యంగా ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధితో సహా 17 రకాల అత్యవసర మందుల ధరలను తగ్గించాలని కేంద్రం నిర్ణయించడం పేదలకు ఎంతో ఊరటనిస్తుందని ఆయన చెప్పారు. ఆరోగ్యంపై పెట్టే ఖర్చు తగ్గి, సామాన్యుడిపై ఆర్థిక భారం తగ్గుతుందని ఈ సందర్భంగా ఈటల గుర్తుచేశారు. దేశం స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో దిగుమతులను తగ్గించుకునేలా బడ్జెట్‌లో పక్కా ప్రణాళికలు రూపొందించారని ఈటల రాజేందర్ తెలిపారు. స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల దేశీ పరిశ్రమలు పుంజుకుంటాయని, 'మేక్ ఇన్ ఇండియా' ఆశయాలు నెరవేరుతాయని ఆయన స్పష్టం చేశారు. వివిధ రంగాల వారీగా బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు సమతుల్యంగా ఉన్నాయని, అట్టడుగు వర్గాల నుండి అగ్ర వర్ణాల పేదల వరకు అందరికీ న్యాయం జరిగేలా బడ్జెట్ రూపకల్పన జరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థుల కోసం విద్యా రుణాలు, స్కాలర్‌షిప్‌ల విషయంలో కూడా సానుకూల నిర్ణయాలు ఉన్నాయని వివరించారు.



మొత్తంగా చూస్తే ఈ బడ్జెట్ పేదలు, యువత, విద్యార్థుల కలలకు ప్రతిరూపంగా నిలుస్తుందని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు. దేశాన్ని అగ్రరాజ్యంగా మార్చే క్రమంలో ప్రతి ఒక్కరూ ఈ బడ్జెట్‌ను ఆహ్వానించాలని కోరారు. కేవలం అంకెలే కాకుండా, ఆచరణాత్మకమైన విధానాలతో దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయని ఈటల విశ్లేషించారు. మోదీ నాయకత్వంలో భారత్ సరికొత్త శిఖరాలను అధిరోహించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

అనంతరం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై ఈటల రాజేందర్ తనదైన శైలిలో స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షాల గొంతు నొక్కేలా, వ్యక్తుల గోప్యతకు భంగం కలిగించేలా ఫోన్ ట్యాపింగ్ జరిగిందనేది జగమెరిగిన సత్యమని ఆయన మండిపడ్డారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో అనేక ఆధారాలు బయటపడ్డాయని, ట్యాపింగ్ జరిగిందనే విషయం ప్రాథమికంగా రుజువైందని ఆయన గుర్తుచేశారు. ఈ కేసులో విచారణ ఎదుర్కొంటున్న అధికారులు, నాయకులు చట్టం ముందు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు.

ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై జరుగుతున్న సిట్ విచారణ గురించి స్పందిస్తూ.. చట్టం ఎవరికీ చుట్టం కాదని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. సిట్ అనేది స్వతంత్రంగా పనిచేస్తుందని, విచారణలో నిజానిజాలు తప్పకుండా వెలుగులోకి వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సిట్ పరిధికి లోబడే విచారణ జరుగుతుందని, అందులో రాజకీయ విద్వేషాలకు తావు లేదని ఆయన వివరించారు. తప్పు చేసిన వారు ఎవరైనా సరే శిక్ష అనుభవించాల్సిందేనని, గత పాలకుల అక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఇలాంటి అప్రజాస్వామిక చర్యలు మళ్ళీ పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఈటల డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ అనేది కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన విషయం కాదని, అది వ్యవస్థల నాశనానికి దారితీసే ప్రమాదకరమైన పోకడ అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం జరగాలని, నిందితులు చట్టం నుండి తప్పించుకోలేరని ఆయన స్పష్టం చేశారు. విచారణ సంస్థలు నిష్పక్షపాతంగా వ్యవహరించి బాధ్యులను బోనెక్కించాలని ఆయన కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఈటల రాజేందర్, అటు కేంద్ర బడ్జెట్ అంశాలను ఇటు రాష్ట్ర రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ తన అభిప్రాయాలను కుండబద్దలు కొట్టారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను రాష్ట్రం సక్రమంగా వినియోగించుకుని అభివృద్ధి బాటలో నడవాలని ఆయన ఆకాంక్షించారు. అదే సమయంలో తప్పు చేసిన వారు ఏ స్థాయిలో ఉన్నా వదిలే ప్రసక్తే లేదని కేంద్రం మరియు విచారణ సంస్థలు స్పష్టం చేస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. ఈటల వ్యాఖ్యలు ఇప్పుడు అటు రాజకీయ వర్గాల్లోనూ, ఇటు సోషల్ మీడియాలోనూ తెగ వైరల్ అవుతున్నాయి..



# సిట్ విచారణకు వ్యతిరేకంగా నిరసన

- **సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం**
- **బిఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ కౌన్సిలర్ గౌని భాస్కర్ గౌడ్ అరెస్ట్**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బి ఆర్ ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుపై రాజకీయ కక్షతో ఫోన్ ట్యాపింగ్ పేరుతో సిట్ విచారణ చేపట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద అంబర్‌పేట్ డివిజన్ పరిధిలోని పెద్ద అంబర్‌పేట్ కూడలిలో ఆదివారం ఉగ్ర నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాస్తారోకో చేపట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కేసీఆర్ ని సిట్ అధికారులు విచారణకు పిలిచిన నేపథ్యంలో, ఆయనకు అండగా నిలుస్తూ బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.కేసీఆర్‌ను వేధించడం ఆపాలి, తెలంగాణ అస్తిత్వంపై దాడులు సహించం అంటూ నినాదాలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న సమయంలో పోలీసులు అడ్డుకొని ఇబ్రహీంపట్నంనియోజకవర్గం నాయకులను గౌని భాస్కర్ గౌడ్ , ఈదమ్మల బలరాం, దండెం రాంరెడ్డితో పాటు పలువురు నాయకులను అరెస్ట్ చేసి హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ అరెస్టులు ప్రాంతంలో ఉద్రిక్తతకు దారితీశాయి. అరెస్ట్‌కు ముందు గౌని భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ..చావునోట్లో తలపెట్టి 'కేసీఆర్ సచ్చుడో - తెలంగాణ వచ్చుడో' అనే ధృఢ సంకల్పంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తెలంగాణ జాతిపిత కేసీఆర్ ని ఆదివారం రోజు కక్షపూరితంగా సిట్ విచారణ పేరిట వేధించడం తెలంగాణ అస్తిత్వానికే అవమానం అని తీవ్రంగా మండిపడ్డారు. రాజకీయ కక్షతో ఫోన్ ట్యాపింగ్ కేసును రోజూ డైలీ సీరియల్‌లా కొనసాగిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పైశాచిక ఆనందం పొందుతోందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలు, కుంభకోణాలు, ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ జాతిపితపై జరుగుతున్న ఈ అన్యాయాన్ని తెలంగాణ సమాజం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని, అధికారం శాశ్వతం కాదని, ప్రజలే తగిన సమయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మరియు కాంగ్రెస్ పార్టీకి సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపలేరని, పోరాటం మరింత ఉధృతంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బి ఆర్ఎస్ ఉద్యమ కారుడు పొగాకు నరసింహ గౌడ్, మాజీ కౌన్సిలర్ దేసారం బాలకృష్ణ గౌడ్, పిల్లి నగేష్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, తాజా మాజీ కౌన్సిలర్లు మండల కోటేశ్వర్ రావు, చిట్టి నవీన్ గౌడ్, బాబు గౌడ్, అర్చన దామోదర్, రావుల గోపాల్, కళ్ళెం వెంకట్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సేవాలాల్ జయంతిని విజయవంతం చేయండి



- **గోడపత్రికను ఆవిష్కరించిన మహామండలేశ్వర్**
- **ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు**
- **జహీరాబాద్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు**

**జహీరాబాద్, విశాలభారతి:**

గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ 287వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని బర్దిపూర్ ఆశ్రమ పీఠాధిపతి మహామండలేశ్వర్ సిద్ధేశ్వరానందగిరి పిలుపునిచ్చారు. జహీరాబాద్ పట్టణంలో ఈ నెల 15న నిర్వహించనున్న సేవాలాల్ జయంతి ఉత్సవాలు, శోభాయాత్రకు సంబంధించిన గోడపత్రికను జయంతి ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఆశ్రమ ప్రాంగణంలో ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మహామండలేశ్వర్ సిద్ధేశ్వరానందగిరి మాట్లాడుతూ... సేవాలాల్ మహారాజ్ బోధనలు యువత అనుసరించాలని, సమాజంలో ఐక్యత, సేవాభావం పెంపొందించుకోవాలని సూచించారు. జయంతి కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాతృసి అనసూయ మాత, పూజ శ్రీ నందినిశ్రీ గిరి మాత, జహీరాబాద్ కోర్టు పీపీ సుభాష్ రాథోడ్, సేవాలాల్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రాథోడ్, డాక్టర్ సుభాష్ జాదవ్, కోశాధికారి నరేష్ చవాన్, విజయ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంను అడిగి ఎన్ని నిధులైనా తెస్తా

**విశాలభారతి, నల్లగొండ:**





మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమరానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. ఆదివారం అభ్యర్థులతో నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో కార్పొరేటర్ల విజయాన్ని తన వ్యక్తిగత విజయంగా అభివర్ణించారు. మున్సిపల్ కార్పొరేషన్ హోదా వచ్చిన తర్వాత జరుగుతున్న మొదటి ఎన్నికలు ఇవని, ఇందులో 48కి 48 స్థానాల్లో ఘన విజయం సాధించి నల్లగొండను అభివృద్ధి పథంలో నిలపాలని పిలుపునిచ్చారు. టికెట్ల కేటాయింపులో సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ బీసీలకు 70 శాతం సీట్లు కేటాయించి రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచామని, క్షేత్రస్థాయిలో అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు సాగాలని ఆయన అభ్యర్థులకు సూచించారు. నల్లగొండ పట్టణ సమగ్రాభివృద్ధి బాధ్యతను తాను భుజానికెత్తుకుంటానని, అభ్యర్థులు కేవలం గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఎన్ని నిధులైనా తీసుకొచ్చి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. గత మూడు దశాబ్దాలుగా ప్రజలతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ, భవిష్యత్తులో వేల కోట్ల రూపాయలతో సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరవేస్తామని భరోసా ఇచ్చారు. అధికార పార్టీ అభ్యర్థులు గెలిస్తేనే అభివృద్ధి, సంక్షేమ పనులను వేగంగా పూర్తి చేయడం సాధ్యమవుతుందని, ప్రతి ఓటరును కలిసి ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించి వారి ఆశీస్సులు పొందాలని కోరారు. పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూస్తానని చెబుతూనే, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములు కావాలని మంత్రి ఆవేదనతో కూడిన విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఇంటర్ చదువుతున్న పిల్లలతో సహా ఒకే కుటుంబం ఆత్మహత్య చేసుకున్న ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని, పేదలకు కష్టమొస్తే తట్టుకోలేనని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రతి డివిజన్‌లో ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధులు ఉండాలని, అందుకే అభ్యర్థులంతా సేవా దృక్పథంతో పనిచేసి విజయం సాధించాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆకాంక్షించారు. అందరూ సమన్వయంతో పనిచేసి నల్లగొండ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కోరుతూ అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు.



# ఉపాధి హామీ చట్టం నిర్వీర్యం చేస్తున్న కేంద్రం ప్రభుత్వం

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్**

**చౌటుప్పల్, విశాలభారతి:**




సిపిఎం మరియు వామపక్ష పార్టీల సుదీర్ఘ పోరాటాల ఫలితంగా వచ్చిన మహాత్మా గాంధీ పేరుమీద ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిందని దీని స్థానంలో విబి జి రామ్ జి పేరుతో కొత్త చట్టాన్ని తెస్తూ నిధుల కోత,పనిదినాల కోతకు కుట్ర చేసిందని,కూలీల పొట్టగొట్టే కేంద్ర ప్రభుత్వ చర్యలకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2 నుండి 15 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో మండల, పట్టణ కేంద్రాలలో నిరసనగా సభలు,ర్యాలీలు,నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ పిలుపునిచ్చారు.ఆదివారం చౌటుప్పల పట్టణంలోని కందాల రంగారెడ్డి భవనంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుంటోజు శ్రీనివాస్ చారి అధ్యక్షతన జరగగా సమావేశంలో జహంగీర్ పాల్గొని మాట్లాడుతూ పేదల పొట్ట కొట్టడానికి ఉపాధి హామీ చట్టం స్ఫూర్తికి విరుద్ధంగా,విబి జి రామ్ జి అనే కొత్త చట్టాన్ని కేంద్రం తెచ్చిందని అన్నారు.పాత చట్టంలో 90శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం భరిస్తుంటే, కొత్త బిల్లులో రాష్ట్రాలపై 40 శాతం భారం మోపిందని విమర్శించారు.దీంతో ఆర్థిక స్తోమత లేని రాష్ట్రాలు ఈ భారాన్ని భరించలేక పథకాన్ని ఆపేసే కుట్ర ఇందులో స్పష్టంగా కనిపిస్తున్నది అన్నరు.వ్యవసాయ సీజన్లో 60 రోజుల పని దినాలను తొలగించాలనే నిబంధన కూలీలను తిరిగి యజమానుల వద్ద తక్కువ వేతనానికి బానిసలుగా మార్చే కుట్ర కోనము దాగిందాని అన్నారు.ఈ కొత్త చట్టం వల్ల రాజ్యాంగం కల్పించిన పని హక్కు ను కూలీలు కోల్పోతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 60 లక్షల మంది కూలీలు ఈ పథకంపై ఆధారపడి ఉన్నారని కొత్త చట్టం వల్ల నిధులు,పనిదినాలు పూర్తిగా తగ్గిపోతాయని,కూలీలు వలస బాట పట్టవలసి వస్తుంది అన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే విబి జి రామ్ జి చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, 2005 మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని, పని దినాలను 200రోజులకు పెంచడంతో పాటు రోజువారీ వేతనం రూ.800లకు పెంచాలని,పట్టణ పేదలకు కూడా ఈ చట్టాన్ని వర్తింపజేయాలని,నిధులు మొత్తం కేంద్రమే భరించాలని,చట్టం అమలు బాధ్యత కేంద్రమే తీసుకోవాలని జహంగీర్ డిమాండ్ చేసినారు.ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ,బట్టుపల్లి అనురాధ,జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు,కల్లూరి మల్లేశం,జెల్లెల పెంటయ్య,బూరుగు కృష్ణారెడ్డి,జిల్లా కమిటీ సభ్యులు యండి పాషా,గంగాదేవి సైదులు,గోశిక కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మొయినాబాద్ టిఆర్ఎస్ నిరసన ర్యాలీ



**మొయినాబాద్, విశాలభారతి:** మాజీ సీఎం కేసీఆర్ ను సీట్ విచారణ కు పిలవడాన్ని నిరసిస్తూ టిఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. మన మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నల్ల బ్యాడ్జిలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, కొత్త నరసింహారెడ్డి, ఫోన్ టాపింగ్ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి కేసిఆర్ కుటుంబాన్ని ఇబ్బందులు పెడుతున్నారనీ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ ఎన్నికల ఇంచార్జ్ అమృతలాల్ చౌహన్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న, సమన్వయ కమిటీ సభ్యులు దారెడ్డి వెంకటరెడ్డి, శ్రీహరి యాదవ్, జయంత్, రాహుఫ్, కోట్ల నరోత్తం రెడ్డి, మాజీ సర్పంచులు సుధాకర్ యాదవ్, రెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, రవీందర్ యాదవ్, గణేష్ రెడ్డి, అంజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



**నిజామాబాద్, విశాలభారతి:** సాలురా మండలం కొప్పర్తి క్యాంపులో లక్ష్మీ తిరుపతమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ వార్షికోత్సవ వేడుకలలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన ఆయనను ఆలయ కమిటీ సభ్యులు వేద పండితుల మంత్ర చర్ల మధ్య ఆలయంలోకి ఆహ్వానించారు అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు లక్ష్మీ తిరుపతమ్మ ఆలయం తరఫున ఆయనను ఘనంగా సత్కరించారు అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ఆవరణలో జాతర ఏర్పాటు చేశారు సాలురా బోధన్ రుద్రూర్ కోటగిరి పోతంగల్ మండలాల భక్తులు ప్రజలు వార్షికోత్సవ వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అల్లేజనార్ధన్ రవి అల్లే రమేష్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విజయం దిశగా దూసుకుపోతున్న పావని రెడ్డి



**విశాలభారతి:** మున్సిపాలిటీలోని 17వ వార్డులో టిఆర్ఎస్ అభ్యర్థి పార్టీ పావని రెడ్డి విజయం దిశగా దూసుకుపోతుందనీ మాజీ చైర్మన్ పార్టీ జగన్మోహన్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళం గ్రామంలో 17వ వార్డులో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పార్టీ పావని కి మద్దతుగా ఆదివారం ప్రచారం జోరుగా సాగింది. ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా పార్టీ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అయిన పావనిని గెలిపిస్తే వార్డు అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. గత కొన్ని విలువ గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు చేశామని. ఎన్నికల్లో గెలిచాక మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు తిరుపతి రెడ్డి, వీరారెడ్డి, లక్ష్మీనారాయణ, మధు సాగర్, ప్రసాద్ గౌడ్, ప్రభాకర్, కృష్ణారెడ్డి, సుధాకర్ యాదవ్, సువర్ణ, మంజుల, పద్మ, మల్లారెడ్డి, వీరేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు

## ప్రజలకు అనుకూలమైన కేంద్ర బడ్జెట్

- **బడ్జెట్ వల్ల దేశంలో ఉన్న ప్రతి ఒక్కరికి మేలు**



**నిజామాబాద్, విశాలభారతి:** ఆదివారం పార్లమెంట్లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశంలోని అన్ని వర్గాల వారికి లబ్ధి చేకూరుతుందని, ముఖ్యంగా పేద మరియు మధ్య తరగతి ప్రజలకు ఈ బడ్జెట్ ఎంతగానో ఉపయోగపడుతుందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త పేర్కొన్నారు. రైతులకు, అలాగే రోజువారి పనులు చేసుకునే వారికి ఈ బడ్జెట్ ఎంతో ఉపయోగదాయకమని ఆయన అన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ తో దేశం మరికొన్ని రోజుల్లో అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది ప్రపంచంలోనే అన్ని దేశాలకు మార్గదర్శకంగా నిలిచి ప్రపంచ దేశాల సరసన నిలబడడం ఖాయమన్నారు. భారతదేశంలో ఉన్న ప్రతి పౌరుడుకి ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల ఉపయోగం చేకూరుతుందని ఆయన అన్నారు. ఇప్పటివరకు ఏ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టని విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సూచనలతో ఆర్థిక మంత్రి ఈ బడ్జెట్ ను రూపొందించారని ఎమ్మెల్యే కొనియాడారు. బడ్జెట్ పై ప్రతిపక్షాలు చేస్తున్న కల్పితాలను ప్రజలు నమ్మకూడదని ఈ బడ్జెట్ కేవలం దేశాభివృద్ధి కోసమేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మృతి పట్ల సంతాపం

- **నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త**
- **నిషేధిత గంజాయి పై అధికారులు, ప్రభుత్వం ఉక్కు పాదం మోపాలి**

**నిజామాబాద్, విశాలభారతి:** ఇటీవల విధి నిర్వహణలో భాగంగా ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య పై గంజాయి అరాచక ముఠా జరిపిన దాడిలో తొమ్మిది రోజులపాటు చావు బతుకులతో పోరాడుతూ శనివారం రాత్రి తుదిశ్వాస విడిచిన ఆమెకు సంతాపం తెలుపుతూ నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిషేధిత గంజాయి ఏరివేత కోసం తను నిర్వహిస్తున్న విధుల్లో భాగంగా ఆమెను తీవ్రంగా దాడి చేయడాన్ని బిజెపి పార్టీ తరఫున తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అర్బన్ నియోజకవర్గం గంజాయి రహిత జిల్లాగా ఉండేటట్లు ఎక్సైజ్ అధికారులు ఇకపై గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. చిన్న వయసులోనే ఉద్యోగం సంపాదించి ఎన్నో కలలు కన్న కానిస్టేబుల్ సౌమ్య తొమ్మిది రోజులపాటు చావు బతుకులతో పోరాడి శనివారం రాత్రి మరణించారనే వార్త తనకు ఎంతో బాధ కలిగించిందని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి వహించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థికంగా ఎక్స్గ్రేషియా ప్రకటించాలని అన్నారు. అలాగే ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఈ చిరునవ్వులే రేపటి దేశ భవిష్యత్తు

**నల్లకుంట టైం కిడ్స్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీదేవి**

**ముషీరాబాద్, విశాలభారతి:** స్కూల్ మొదటి మెట్టు ఎక్కుతున్న చిన్నారుల చిరునవ్వులే రేపటి దేశ భవిష్యత్తు అని నల్లకుంట టైం కిడ్స్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీదేవి అన్నారు.చిన్న వయసులోనే పిల్లలకు క్రమశిక్షణ మంచి అలవాట్లు ప్రేమ విలువలు నేర్పితే జీవితంలో పైకి ఎదుగుతారని చెప్పారు. ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నల్లకుంట టైం కిడ్స్ 16వ అన్యువల్ డే సెలబ్రేషన్స్ ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ పిల్లల్ని ఇంట్రెస్ట్ గా స్కూల్ కి వచ్చే విధంగా చేస్తూ వారికి చదువుతోపాటు ఆటలు పాటలు నేర్పుతూ ఆల్ రౌండ్ గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్లే స్కూల్, పి పి 1, పి పి 2, నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ విద్యార్థులను అన్ని ప్రోగ్రామ్స్ లో ఇన్వాల్వ్మెంట్ చేసి వారిలో ఉన్న భయాన్ని తొలగిస్తున్నామని చెప్పారు.




## సత్తుపల్లిలో ఐఎన్టీయూసీ శక్తివంతమైన సమీకరణ



- **సంక్షేమమే లక్ష్యంగా ఐఎన్టీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశం**
- **సింగరేణి ఉద్యోగులకు 1.25 కోట్ల ప్రమాద బీమా అమలు**
- **డిపెండెంట్ ఉద్యోగ వయోపరిమితి 35 నుంచి 40 సంవత్సరాలకు పెంపు**
- **2539 ఉద్యోగాల భర్తీతో పాటు 1741 కారుణ్య నియామకాలు**

**సత్తుపల్లి, విశాలభారతి:**

సత్తుపల్లి పట్టణంలో తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు ఐఎన్టీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశాన్ని సత్తుపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ నాయకులు సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, రీజినల్ జనరల్ సెక్రటరీ ఆల్బర్ట్, జాయింట్ జనరల్ సెక్రటరీ తీగల క్రాంతి కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఐఎన్టీయూసీ యూనియన్‌కు పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో సింగరేణి ఉద్యోగులకు 1.25 కోట్ల రూపాయల ప్రమాద బీమా అమలు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే ఉద్యోగుల పిల్లల డిపెండెంట్ ఉద్యోగ వయోపరిమితిని 35 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాలకు పెంచడం సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పీతాంబరం, సెంట్రల్ కమిటీ నాయకులు రావి నాగేశ్వరరావు, అభిషేక్, రామారావు (ఫిట్ సెక్రటరీ - జేవీఆర్ ఓసీ), నాగ ప్రకాష్, బాలాజీ (ఫిట్ సెక్రటరీ - కిష్టారం ఓసీ), నాగేష్ (ఫిట్ సెక్రటరీ - జేవీఆర్ సీహెచ్పీ)తో పాటు ఐఎన్టీయూసీ బ్రాంచ్ కమిటీ నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రుణం మొత్తం కట్టించుకున్నారు

- **కొత్త రుణం ఇవ్వమంటే ఇవ్వమంటున్నారు**
- **ఆందోళన చెందుతున్న డ్వాక్రా గ్రూప్ సభ్యులు**

**అశ్వాపురం, విశాల భారతి :**



మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన సాయి శృతి డ్వాక్రా గ్రూప్ సభ్యులు డ్వాక్రా రుణం కోసం గత కొంతకాలంగా మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తమకు డ్వాక్రా ద్వారా నూతన రుణం మంజూరీకి గ్రామ దిపికతో పాటు తమ ప్రాంత సిసి, ఏపీఎం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మల్లెలమడుగు గ్రామానికి చెందిన డ్వాక్రా గ్రూపులోని దళిత మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు డ్వాక్రా గ్రూపు సభ్యులు చెబుతున్నది ఏమిటంటే 2023వ సంవత్సరంలో ఆ గ్రామానికి చెందిన సాయి శృతి గ్రూపు నుండి పదిమంది సభ్యులు 10 లక్షల డ్వాక్రా రుణాన్ని తీసుకున్నారు. అయితే ఆ సభ్యుల లోని ఏడుగురు క్రమం తప్పకుండా లోన్ వాయిదా సొమ్మును చెల్లించారు. ఆ గ్రూపు సభ్యులలో ఓ ముగ్గురు మాత్రం కుటుంబాలలో తీవ్రమైన ఇబ్బందులు తలెత్తడంతో తీసుకున్న రుణాన్ని బ్యాంకుకు చెల్లించలేకపోయారు. ఇటీవల గ్రామానికి చెందిన గ్రామ దీపికతో పాటు సంబంధిత అధికారులు మీరు తీసుకున్న రుణాన్ని మొత్తం వడ్డీతో సహా చెల్లించండి మరల కొత్త రుణాన్ని అందజేస్తామని వారికి వివరించారు. దీంతో వారు కుటుంబంలో ఇబ్బందులను పక్కనపెట్టి వేరొక ప్రాంతంలో అప్పులు చేసి వడ్డీతో సహా వారు తీసుకున్న రుణాన్ని బ్యాంకుకు కట్టేశారు. దీనికి ముందు మొండికుంటలోని వారికి లింకేజీ ఉన్న బ్యాంకు మేనేజర్ ని కూడా తాము డబ్బులు మొత్తం చెల్లిస్తే మరలా వెంటనే రుణం ఇస్తారఅని సలహా కూడా తీసుకున్నామని చెబుతున్నారు. దీంతో సదరు మేనేజర్ కూడా మీ రుణాన్ని వడ్డీతో సహా చెల్లించండి వెంటనే కొత్త రుణాన్ని మంజూరు చేస్తానని తెలిపాదని గ్రూప్ సభ్యులు చెప్తున్నారు. తీరా ఇప్పుడు బ్యాంకు రుణం మొత్తం చెల్లించిన తర్వాత రుణం ఇవ్వలేమని అంటున్నారని, ఏపిఎం నేను ఇవ్వను ఏం చేసుకుంటారో చేసుకోమని అంటుందని డ్వాక్రా గ్రూపులోని దళిత మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ ఉన్నత అధికారులు తమ కుటుంబ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తమకు డ్రోక్రా గ్రూప్ నుండి నూతన రుణాన్ని ఇప్పించాలని కోరుతున్నారు.

## కెసిఆర్ పై రాజకీయ కక్షతో అక్రమ కేసులు

**కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా బి ఆర్ ఎస్ నిరసన**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్:**



తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పై రాజకీయ కక్షతో కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేసి, అక్రమ నోటీసులు జారీ చేసి విచారణకు పిలవడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, బి ఆర్ ఎస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు మన్సూరాబాద్ డివిజన్ (ప్రస్తుత లెక్చరర్స్ కాలనీ డివిజన్) పరిధిలోని హయత్‌నగర్ ప్రాంతంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. హయత్‌నగర్‌లోని హెచ్ డి ఎఫ్ డి బ్యాంక్ ఎదురుగా ఉన్న మెయిన్ రోడ్డుపై బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. కెసిఆర్ పై తీసుకుంటున్న చర్యలు పూర్తిగా రాజకీయ ప్రతీకారమేనని, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు ఆరోపించారు.నిరసనలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన నుంచి పదేళ్ల పాలన వరకు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన కెసిఆర్ ప్రజాదరణను తట్టుకోలేక కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు, నోటీసుల రూపంలో వేధింపులకు పాల్పడుతోందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం తన పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ప్రజా నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని పేర్కొన్నారు. అక్రమ కేసులు, నోటీసులతో ప్రజా ఉద్యమాలను అణిచివేయాలనే ప్రయత్నాలు సరికాదని, ఇటువంటి నిరంకుశ విధానాలకు ప్రజలే తగిన సమయంలో గుణపాఠం చెబుతారని బి ఆర్ ఎస్ నేతలు స్పష్టం చేశారు. కెసిఆర్ పై జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా బి ఆర్ ఎస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయదని, ప్రజలతో కలిసి ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు నిరంతర పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, హయత్‌నగర్ డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్‌తో పాటు చంద్రా రెడ్డి, పరమేశ్ గౌడ్, వెంకట్ రెడ్డి, భాస్కర్ సాగర్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ల ఉపసంహరించుకున్న అభ్యర్థులు

**మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రాంరెడ్డి**




**చౌటుప్పల్, విశాలభారతి:** మున్సిపాలిటీ రెండవ సాధారణ ఎన్నికలు 2026 ప్రక్రియలో భాగంగా,నామినేషన్ల ఉపసంహరణ మొదటి రోజైన ఆదివారం నాడు ఆరుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు జిల్లా సహాయ ఎన్నికల అధికారి మరియు మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదరు అభ్యర్థులు వివరాలు 5వ వార్డు కొండూరు వెంకటేశం 10వ వార్డు వసనం ఎల్లుబాయి 18వ వార్డు కరెంటోతు రవీందర్,రాతుల సోను నాయక్ 19వ వార్డు వర్కాల రాము,20వ వార్డు ఎస్ కె జానీ బాబా స్వచ్ఛందంగా తమ తమ నామినేషన్ల ఉపసంహరించుకున్నారు. ఉపసంహరణకు ఇంకా సమయం ఉన్నందున,తుది బరిలో నిలిచే అభ్యర్థుల వివరాలను గడువు ముగిసిన అనంతరం పూర్తిస్థాయిలో వెల్లడిస్తామని కమిషనర్ ఈ సందర్భంగా తెలియజేశారు.

## కాంగ్రెస్ విజయానికి తోడ్పడండి: చింతకుంట్ల లక్ష్మీనారాయణ



**కోదాడ, విశాలభారతి:** లక్ష్యం ఒక్కటే పార్టీ గెలుపే ముఖ్యం: కాంగ్రెస్ సమన్వయకర్తలు, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేయాలని మున్సిపల్ ఎన్నికల సమన్వయకర్తలు చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, ముత్తవరపు పాండురంగారావులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని 14వ వార్డు రామినేని శ్రీనివాసరావు నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అభ్యర్థి ఎవరన్నది ముఖ్యం కాదని, పార్టీ గెలుపు కోసమే ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలు అండగా ఉంటారని, భవిష్యత్తులో తప్పక న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వార్డు ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో రామినేని శ్రీనివాసరావు,కందుల కోటేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, భద్రారెడ్డి,ఈదుల కృష్ణయ్య, పట్టాభి రెడ్డి ముత్తవరపు రామారావు, మేకల వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ధర్నా కు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలి

**ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు సదానంద గౌడ్**




**కోదాడ, విశాలభారతి:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అన్ని సంఘాలు ఏకమై ఉమ్మడి కార్యాచరణతో పోరాడాలని స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సదానంద గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం కోదాడలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జరిగిన సూర్యాపేట జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీస్ రూల్స్ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని, 398 టీచర్ల అప్రెంటిస్ పీరియడ్ ఇంక్రిమెంట్లను పదవీ విరమణ సమయానికైనా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే పీఆర్సీ, హెల్త్ కార్డులు, డీఏ బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలనే డిమాండ్‌తో ఫిబ్రవరి 5న దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు బంధం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పలూరి అంజయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వి. సత్యనారాయణ, మాజీ ఉపాధ్యక్షులు బొమ్మగాని నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షులు నందిపాటి సైదులు, మరియు వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు నరసింహారావు, భిక్షం, పాడె సురేష్, ఖాసిం, శ్రీనివాస్, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**జెడ్ పిహెచ్ఎస్ స్టేషన్ ఘణపూర్‌లో రెండవ ఆత్మీయ సమ్మేళనం**

**జనగాం, విశాలభారతి:** జిల్లాలోని స్టేషన్ ఘణపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల 10వ తరగతి 198687 బ్యాచ్ పూర్వ విద్యార్థుల రెండవ సమ్మేళనం బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థి సంబంధిత జయ గార్డెన్ లో స్నేహపూర్వక వాతావరణం లో ఘనంగా నిర్వహించారు. చిన్ననాటి నుంచి మొదలైన స్నేహం కాలంతో తగ్గదు మన స్నేహం చెరిగిపోదు అనే సందేశంతో నిర్వహించిన ఈ సమావేశంలో మొత్తం 55 పూర్వ విద్యార్థులు పాల్గొన్న ఈ సందర్భంగా పాఠశాల జీవితం నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, అప్పటి గురువులు తరగతి అనుభవాలను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు కలుసుకుని ఆత్మీయంగా పలకరించుకోవడంతో కోలాటా కోలాటాలు, ఆటపాటలతో కార్యక్రమం ఆనందభరితంగా ఉత్సాహంగా, సాగింది. భవిష్యత్తులోనూ ఇలాంటి సమ్మేళనాలు ఇంకెన్నో కొనసాగించాలని స్నేహ బంధాలను మరింత బలపరుచుకోవాలని, పూర్వ విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి నిమ్మ. త్రివేణి నెల్లుట్ల సునీత, శారద, సాగ శోభారాణి, కౌడ మహేశ్వరి, కటకం మంజుల, మొగుదుంపురం కిషోర్, పార్శీ రంగన్న, కందలోజు. రవి, పాలకుర్తి శ్రీనివాస్, అక్కిరెడ్డి విద్యాసాగర్ రెడ్డి, మేదిని రామలింగా రెడ్డి, దీకొండ విష్ణు షాగ. కుమారస్వామి, దాసరి రాజయ్య, సర్వర్ పాషా, రామ్ నారాయణ పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీకి భారీ రాజకీయ ఎదురు దెబ్బ

- బిఆర్ఎస్‌లో చేరిన చింతల ఉమామహేశ్వరి,సాయిలు
- ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన కాంగ్రెస్
- కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే




**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని పట్టణ కాంగ్రెస్ పార్టీకి మున్సిపాలిటీ ఎన్నికలవేళ రాజకీయంగా భారీ ఎదురుదెబ్బ తగిలింది.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతల ఉమామహేశ్వరి సాయిలు తమ పార్టీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేసి బిఆర్ఎస్ పార్టీలో చేరారు.మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి సమక్షంలో వారు గులాబీ కండువా కప్పుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా బీఆర్ఎస్ లో చేరిన నేతలు మాట్లాడుతూ,చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధి కేవలం బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం,పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనకు స్పష్టమైన దిశ విధానం ఉన్నాయని పేర్కొన్నారు.రానున్న మున్సిపల్ ఎన్నికల్లో చౌటుప్పల్ లో ఎగిరేది బిఆర్ఎస్ జెండానేనని ధీమా వ్యక్తం చేశారు.మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ,ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీని విడిచి బిఆర్ఎస్ వైపు ప్రజలు,అన్ని పార్టీల నాయకులు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. చౌటుప్పల్ లో బిఆర్ఎస్ ను మరింత బలోపేతం చేసి మున్సిపాలిటీ పై గులాబీ జెండా ఎగరవేయడమే లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన సభ్యులను ఘనంగా స్వాగతించారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి,బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్,పట్టణ అధ్యక్షులు బొమ్మిడి వెంకటరెడ్డి మరియు పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మనాలి ఠాకూర్



**విశాలభారతి, గోదావరిఖని:** రామగుండం కార్పొరేషన్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా శనివారం నాడు రామగుండం 30వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఈసంపల్లి అంజుల్ ఎన్నికల ప్రచారంలో మనాలి ఠాకూర్ పాల్గొన్నారు. ప్రతి నగరంలో ఇంటింటికి తిరుగుతు ప్రచారానికి ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా సందర్భంగా రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు వారి సతీమణి మనాలి ఠాకూర్. మాట్లాడుతూ అభివృద్ధి లక్ష్యాలను నిర్వహిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ,ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.రామగుండం నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధి, త్రాగునీటి సమస్య పరిష్కారం, రోడ్ల నిర్మాణం, పారిశుధ్య వ్యవస్థ మెరుగుదల, యువతకు ఉపాధి అవకాశాలు వంటి అంశాలను ప్రాధాన్యతగా తీసుకుని పని చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇస్తే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన అందిస్తామని భరోసా ఇచ్చారు.అంజుల్ మాట్లాడుతూ, తనను గెలిపిస్తే డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేయడమే తన లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్ అభ్యర్థులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి

- మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



**చౌటుప్పల్, విశాలభారతి:** ఉద్యమ నాయకుడు,తెలంగాణ తొలి ముఖ్యమంత్రి,బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుని కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే రాజకీయ ప్రతీకారంతో సిట్ విచారణ పేరుతో వేధింపులకు గురిచేస్తున్న చర్యలను తీవ్రంగా ఖండిస్తూ,మునుగోడు నియోజకవర్గం చౌటుప్పల మున్సిపాలిటీ కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీకి మాజీ శాసనసభ్యులు శ్రీ కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి నేతృత్వం వహించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలు,గ్రామాల నుంచి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు,అభిమానులు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేసీఆర్ పై కుట్రలు ఆపాలి సిట్ విచారణ పేరుతో రాజకీయ వేధింపులు మానాలి అంటూ నినాదాలతో చౌటుప్పల కేంద్రం మార్మోగింది.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గట్టిగా ప్రసంగిస్తూ,తెలంగాణ సాధన కోసం జీవితాన్ని అంకితం చేసిన ఉద్యమ నాయకుడిని,రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన తొలి ముఖ్యమంత్రిని కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే లక్ష్యంగా చేసుకుని అసత్య ఆరోపణలు,విచారణల పేరుతో రాజకీయంగా దెబ్బతీయాలని చూస్తోందని తీవ్రంగా మండిపడ్డారు. ప్రజల వ్యతిరేకతను కాంగ్రెస్ ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతుందని, అందుకే ప్రతిపక్ష నేతను అణిచివేసే కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు.కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం సాగునీరు,విద్యుత్,మౌలిక సదుపాయాలు,సంక్షేమ పథకాలలో దేశానికే ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు. అలాంటి నాయకుడిపై సిట్ విచారణల పేరుతో రాజకీయ కక్ష సాధించడం ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడిచే చర్య అని ఆయన వ్యాఖ్యానించారు. మాజీ పిఎసిఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్,పట్టణ అధ్యక్షులు బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి,మరియు మండల,పట్టణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మంచి మనసు



**వలిగొండ, విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని దుప్పల్లి గ్రామం లోని పేద ప్రజల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మరోసారి తన దయార్థ్ర హృదయాన్ని చాటుకున్నారు. దుప్పల్లి గ్రామం మధిర చింతలచర్ల కాలనీ వాసులకు ఎన్నాళ్లుగానో ఉన్న త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తన స్వంత ఖర్చులతో బోరు వేయించి మంచినీటి సౌకర్యం కల్పించడం ప్రజల హృదయాలను హత్తుకుంది. ఈ బోరును దుప్పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామ శాఖ అధ్యక్షులు శ్రీ బీసు వెంకటయ్య ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు ఎమ్మెల్యే ఐలయ్యకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాదగోని శోభారాణి వెంకటయ్య, 3వ వార్డు మెంబర్ పల్సం లావణ్య, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ సండ్ల శ్రీను, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పల్సం స్వామి, మాజీ సర్పంచ్ దాసు, మాజీ ఉపసర్పంచ్ మంగమ్మ, మారయ్య, మద్దెల సాయిబాబు, మొగిలి మధుసూదన్ తదితర నాయకులు, చింతలచర్ల కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య భవన్‌లో ఆత్మీయ సమ్మేళనం



**విశాలభారతి, గోదావరిఖని:** పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ చేస్తున్న అభివృద్ధి నువ్వు చూసి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో శనివారం నాడు భారీ చేరికలు జరిగాయి. 60వ డివిజన్ కి చెందిన మోతుపాటి స్వప్న ఆనంద్, 17వ డివిజన్‌కు చెందిన పోలవేణి రమేష్ కాంగ్రెస్ పార్టీకి జై కొట్టారు.శనివారం ఆర్యవైశ్య భవన్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం లో రామగుండం ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, నూతనంగా చేరిన నాయకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# సిట్ నోటీసులు కక్షసాధింపే

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- బీఆర్ఎస్ పోరాటాన్ని తట్టుకోలేకే కుట్ర
- కాంగ్రెస్‌కు మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి భయం

**విశాలభారతి, గోదావరిఖని:**



బొగ్గు కుంభకోణాన్ని బయటపెట్ట డంతో పాటు జలదోపిడీ పై బీఆర్ఎస్ పోరాటం చేస్తున్న నేపథ్యంలో మాజీ సీఎం కేసీఆర్ పై రాష్ట్ర సర్కార్ కక్షసాధింపు చర్యలకు దిగిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. రాష్ట్ర తొలి సిఎం కేసీఆర్ కి సీట్ నోటీసులు నేపథ్యంలో లో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బీ.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బీ.ఆర్.ఎస్ పార్టీ శ్రేణులు నల్లబడ్జీలు ధరించి నిరసన చేపట్టి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.రాష్ట్రాన్నిపదేండ్ల పాటు అద్భుతంగా అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్కు సిట్ నోటీసులు ఇవ్వడం దుర్మార్గమని మండిపడ్డారు. యావత్ తెలంగాణ సమాజానికి మార్గదర్శకుడిగా కేసీఆర్ ఉన్నారని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల వేళ కాంగ్రెసు ఓటమి భయం పట్టుకున్న దని, ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మ స్థైర్యం దెబ్బతీసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. సీట్లో ఉన్నది పోలీసులా? లేక, సీఎం రేవంత్ రెడ్డి ప్రైవేట్ సైన్యమా? అన్న అనుమానాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. రేవంత్రెడ్డి చేసిన చిల్లరమల్లర ప్రయత్నమే ఈ సిట్ నోటీసులు అని దుయ్య బట్టారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేసీఆర్ తో పోటీ పడాలి కానీ, ఈ విధంగావిధ్వంసం చేయడమేంటని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవెల్లిలోని నివాసంలో ఉంటే, నందినగర్లో నోటీసులు ఇవ్వడం ఏంటని నిలదీశారు. కేసీఆర్ కు సిట్ నోటీసు లపై మేధావులు, కళాకారులు తీవ్రంగా పరిగ ణించాలని కోరారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిపక్ష నాయకులపై అక్రమ ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని సాకుగా చేసుకుని కేసీఆర్ ప్రతిష్టను దెబ్బ తీయాలనే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి స్టంట్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కౌశిక హరి, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, గోపు అయిలయ్య యాదవ్, పర్లపల్లి రవి, మురళీధర్ రావు, గుంపుల లక్ష్మి,జక్కుల తిరుపతి జడ్సన్ సట్టు శ్రీనివాస్ బుర్రి వెంకటేష్ కోడి రామకృష్ణ గుర్రం పద్మ రమ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ స్మైల్ విజయవంతం

- జిల్లాలో 85 మంది బాల కార్మికులకు విముక్తి
- జిల్లావ్యాప్తంగా 35 కేసుల నమోదు
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్

**ఆదిలాబాద్ , విశాలభారతి:**



జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ఆపరేషన్ స్మైల్ పేరుతో జనవరి 1 నుండి 31 వరకు నెలరోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా 85 మంది బాలలను రక్షించి తల్లిదండ్రులకు మరియు వసతి గృహాలకు చేర్చి బాల కార్మికుల వ్యవస్థను నాశనం చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ ఒక పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ స్మైల్ ను విజయవంతం చేయడం జరిగిందని తెలిపారు. ఈ ఆపరేషన్ స్మైల్ నందు జిల్లావ్యాప్తంగా 85 మంది పిల్లలను రక్షించినట్టు అందులో 72 మంది పిల్లలను తల్లిదండ్రులకు 13 మంది పిల్లలను వసతి గృహాలకు తరలించి సొంత వారికి అప్పగించినట్లు తెలిపారు. 85 మంది పిల్లలలో 79 మంది బాలురు 06 బాలికలు ఉన్నట్టు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 35 కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల వారు ఇందులో 24 మంది ఉన్నట్లు తెలిపారు. ఆపరేషన్ స్మైల్ లో భాగంగా జిల్లా వెల్ఫేర్ కమిటీ కార్మిక శాఖ, విద్యాశాఖ, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, వైద్య శాఖ, మరియు ఎన్జీవోల సహకారంతో జిల్లాలో ఆపరేషన్ స్మైల్ ను విజయవంతం చేసి బాల కార్మికులను గుర్తించి తగు చర్యలను తీసుకోవడం జరిగింది. ముఖ్యంగా రెస్క్యూ చేసిన వారిలో హోటళ్లలో, భవన నిర్మాణాలలో, ఇటుక బట్టీలలో పనులలో ఉన్న పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అందజేసి అవగాహన కల్పించడం జరిగిందని బాలలను బడులకు పంపాలని తెలియజేయడం జరిగిందని తెలిపారు. ఇతర రాష్ట్రాల వారికి విడతలవారీగా వారి సొంత స్థలాలకు చేర్చి తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందని తెలిపారు. చట్ట ప్రకారం నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నెల రోజులపాటు కొనసాగిన ఈ ఆపరేషన్ స్మైల్ తో ఆగకుండా, సంవత్సరం పాటుగా బాల కార్మికులు కనబడినట్లయితే వెంటనే డయల్ 100 ద్వారా తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

## కూచిపూడి నృత్యం భారతీయ సంస్కృతికి చిహ్నం



- ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గడ్డం శ్యామ్ కుమార్
- నాట్య మయూరి ఉజ్వలకు సన్మానం

**విశాలభారతి, గోదావరిఖని:**

కూచిపూడి నృత్యం భారతీయ సంస్కృతికి నిజంగా ఒక చిహ్నం లాంటిదని గోదావరిఖని ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గడ్డం శ్యామ్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక కోదండ రామాలయం ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమం సందర్భంగా జనవరి 26 గణతంత్ర దినోత్సవం వేడుకల్లో కూచిపూడి నృత్య ప్రదర్శన చేసిన నృత్య ఖని వ్యవస్థాపకురాలు గుమ్మడి ఉజ్వల ను గడ్డం శ్యామ్ కుమార్ సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో ప్రతి సంవత్సరం నిర్వహించే రిపబ్లిక్ డే సందర్భంగా కూచిపూడి నృత్య ప్రదర్శనకు తెలంగాణ రాష్ట్రం నుండి 30 మంది నృత్య కళాకారులు ఎంపిక చేయగా పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ఉజ్వల ఆ ప్రదర్శనకు ఎంపిక కావడం, ఆ ప్రదర్శన విజయవంతమై ప్రముఖుల మన్ననలు పొందడం గర్వకారణం అన్నారు. సంప్రదాయ కళలను మరచిపోతున్న ఈరోజుల్లో కూచిపూడి నృత్యన్నీ మరింత విస్తరింపజేసేందుకు ఉజ్వల చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కూచిపూడి నృత్యంలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేసిన ఉజ్వల గడిచిన రెండు దశాబ్దాలుగా పారిశ్రామిక ప్రాంతంలో నృత్య ఖని ని పేరుతో వందలాది మందికి కూచిపూడి నృత్యం లో శిక్షణ ఇస్తున్నారని, నృత్య ప్రదర్శన లో ఉజ్వల ది అద్భుతమైన అభినయం అని అయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉజ్వల మరిన్ని ప్రదర్శనలు ఇచ్చి రాష్ట్రనికి, మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని అయన ఆకాంక్షించారు. ఉజ్వలకు ఎల్లవేళల సహకారంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి పెద్దలు, నిర్మలాదేవి, తగరపు శంకర్, రమేష్ తో పాటు విద్యార్థినిలు పాల్గొన్నారు.

## యూరియా ఆన్లైన్లో బుక్ చేసుకునే విధానాన్ని రద్దు చేయాలి

- పట్టా లేని రైతులకు యూరియా అందించే పరిష్కారం ఎన్నడూ
- ఎన్నడూ లేని యూరియా కొరతను నివారించాలి సిపిఎం డిమాండ్

**విశాలభారతి, కరకగూడెం:**



మండల రైతులకు యూరియా ఆన్లైన్లో బుక్ చేసుకునే విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని సిపిఎం పార్టీ మండల కన్వీనర్ కొమరం కాంతారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం ఎన్నడూ లేని యూరియా కొరత పెరిగిందని ఫలితంగా వ్యవసాయంలో పంటల దిగుబడి తగ్గిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్లైన్ యాప్ ద్వారా యూరియా కొనుగోలు చేయడంలో పట్టాదారులకు, కౌలుదారులకు మాత్రమే యూరియా పంపిణీ చేయడం అంటే పట్టా పాస్ పుస్తకాలు లేని రైతులకు యూరియా ఏ విధంగా అందిస్తారో ప్రభుత్వమే సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు ఏజెన్సీ ప్రాంతంలోని రైతులు ఆన్లైన్ వినియోగం చాలా తక్కువ అని ఆండ్రాయిడ్ ఫోన్లు లేని రైతులే అధికంగా ఉన్నారని వారు ఏ విధంగా ఆన్లైన్లో బుక్ చేసుకుంటారో ప్రభుత్వ పెద్దలే సమాధానం చెప్పాలని వారన్నారు. ప్రస్తుత వ్యవసాయ సాగులో ముందు తరం పెద్దలు ముసలివారు ప్రధమంగా వ్యవసాయం సాగు చేస్తున్నారని వారిలో చాలామందికి చదివే సక్రమంగా రానప్పటికీ ఆన్లైన్లో బుక్ చేసుకోవడం అంటే తీవ్ర గందరగోళానికి లోనవడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి కొరతను నివారించేలా యూరియా దిగుమతులు పెంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు చర్ప సత్యం పాల్గొన్నారు.

## నివాళులు అర్పించిన రజిక సంఘాల నాయకులు



**నాచారం, విశాలభారతి:** మాజీ కార్పొరేటర్ స్వర్గీయ నెమలి సురేష్ 7వ వర్ధంతి కార్యక్రమం మల్లాపూర్ డివిజన్ లోని ఎస్వి.నగర్ కాలనీ నెమలి సురేష్ విగ్రహం దగ్గర సూర్య చంద్ర యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, వర్ధంతి కార్యక్రమానికి మల్లాపూర్,శక్తి సాయి నగర్, హెచ్ బి కాలనీ, ఎస్ రావు నగర్ డివిజన్ల వివిధ సంఘాల నాయకులు,కాలనీ సంక్షేమ నాయకులు,వివిధ పార్టీ నాయకులు,నెమలి సురేష్ అభిమానులు , మల్లాపూర్ ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి తమ ప్రియతమ నాయకునికి వర్ధంతి నివాళులు అర్పించడం జరిగింది.

## ఘనంగా జస్ట్ ప్లే స్కూల్ 2వ వార్షికోత్సవం..



**ముషీరాబాద్, విశాలభారతి:** నల్లకుంట లోని జస్ట్ ప్లే స్కూల్ రెండవ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.జెస్ట్ స్కూల్ ప్రిన్సిపల్ సుధా చావలి, డైరెక్టర్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్య అతిథులుగా పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఆస్ట్రాలజీ విభాగం హెచ్ ఓ డి ఫణీంద్ర ఆదిరాజు,చావలి సూర్యనారాయణమూర్తి హాజరయ్యారు.విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఇవాళ కనిపిస్తున్న ఈ చిరునవ్వులే రేపటి దేశ భవిష్యత్తు అని అన్నారు. చిన్న వయసులోనే పిల్లలకు మంచి అలవాట్లు, క్రమశిక్షణ, ప్రేమ, విలువలు నేర్పితే వారు జీవితంలో పైకి ఎదుగుతారని తెలిపారు. పిల్లల భవిష్యత్తు కేవలం స్కూల్ మీద మాత్రమే కాదని తల్లిదండ్రుల బాధ్యత కూడా చాలా గొప్పదన్నారు.ఇంటి వాతావరణం, తల్లిదండ్రుల మాటలు, ప్రవర్తన పిల్లల మనసుపై లోతైన ప్రభావం చూపుతాయని తెలిపారు. రోజుకు కొద్దిసేపైనా పిల్లలతో గడిపి, వారి మాటలు వినండి. వాళ్లలో ధైర్యం, ఆత్మవిశ్వాసం పెంచండి" అని అన్నారు.అనంతరం వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు.

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌తో సిరిమల్లె కాలనీ వాసుల భేటీ



**రాజేంద్రనగర్, విశాలభారతి:** 122వ డివిజన్ పరిధిలోని సిరిమల్లె కాలనీ వాసులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ గారిని 18వ వార్డు మాజీ కార్పొరేటర్ ప్రతినిధి గోకరి సురేష్‌గౌడ్ గారితో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. సిరిమల్లె కాలనీలో డ్రైనేజీ లైన్లు, వాటర్ లైన్లు ఏర్పాటు చేయడంతో పాటు సీసీ రోడ్డు సాంక్షన్ చేయించినందుకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ గారికి, అలాగే మాజీ కార్పొరేటర్ గారికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీలో ఇంకా మిగిలి ఉన్న ఇంటర్నల్ రోడ్లు కూడా వేయించాలని ఎమ్మెల్యే గారిని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. అతి త్వరలో సంబంధిత అధికారులతో మాట్లాడి పెండింగ్ పనులను పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిరిమల్లె కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వం విఫలమైన చోట ప్రజల నాయకత్వం విజయం

**ఎల్‌బీఎస్ నగర్‌లో నీటి సమస్యకు కంచి మహేందర్ శాశ్వత పరిష్కారం**



**కూకట్ పల్లి విశాలభారతి:** ఎన్నాళ్లుగానో ఎల్‌బీఎస్ నగర్‌లో కొనసాగుతున్న తీవ్రమైన తాగునీటి సమస్యకు, బీజేపీ సీనియర్ నాయకులు కంచి మహేందర్ తన కార్యాచరణతో శాశ్వత ముగింపు పలికారు. అధికారులను, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని పలుమార్లు ఆశ్రయించినా పట్టించుకోని పరిస్థితుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా గమనించిన కంచి మహేందర్, రాజకీయాలు పక్కనపెట్టి తన వ్యక్తిగత నిధులతో బోరు వేయించి, పంప్‌ను ఏర్పాటు చేసి ఈరోజు ప్రారంభించారు. ఈ చర్యతో ఎల్‌బీఎస్ నగర్ ప్రజలకు ఎన్నాళ్లుగా ఉన్న నీటి సమస్యకు శాశ్వత ఉపశమనం లభించింది. కార్యక్రమం ఆనందోత్సవంగా మారగా, స్థానికులు కంచి మహేందర్ ని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా కంచి మహేందర్ మాట్లాడుతూ మాటలు కాదు, మార్పు కావాలి. ఫతేనగర్ ఎలా మారిందో ఈ బోరు పంప్ ప్రజల జీవితాల్లో తీసుకువచ్చిన మార్పే దానికి నిదర్శనం అని స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధులు స్థానిక నాయకులు శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రభుత్వం చేతులెత్తేసిన చోట ప్రజల పక్షాన నిలబడి,సమస్యలకు ప్రత్యక్ష పరిష్కారం చూపిన నాయకత్వానికి కంచి మహేందర్ ప్రతీకగా నిలిచారు.

## కేసీఆర్ జోలికి వస్తే సహించేదే లేదు

**రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం**



**విశాలభారతి, కరకగూడెం:** మండలంలోని సమత్ మోతె గొల్లగూడెం బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల దోచుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ కి నోటీసులు ఇచ్చినందుకు వ్యతిరేకంగా రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి గౌరవనీయులు కేసీఆర్ ను విమర్శిస్తే సహించేది లేదని,రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని, టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని కంకణం కట్టడానికి ప్రజల సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు మలకం వెంకటేశ్వర్లు,మండల యూత్ ప్రెసిడెంట్ గుడ్ల రంజిత్ కుమార్,ఉపసర్పంచులు ఇరుప కుచేలుడు,కొమరం నాగేష్, సుతారి నాగేష్,ఇర్ప నాగేష్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ద్వాదశ జ్యోతిర్లింగాల మహా పడిపూజ



**కూకట్ పల్లి, విశాలభారతి:** కూకట్‌పల్లి నియోజకవర్గం భరత్ నగర్ కాలనీలోని హరిహరక్షేత్రం లో మాఘ పౌర్ణమి సందర్భంగా గురు స్వామి నరసింహ ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాల మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు.ఈ పవిత్ర పూజా కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నాగిరెడ్డి, వికె రావు, జి.ఎల్. రెడ్డి తో పాటు స్థానిక భక్తులు ఆంజనేయులు, గురుస్వామి, నాగరాజు, మహేష్, రమేష్, శ్రావణ్, వేణు గోపాల్ తదితరులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందుతూ, మాఘ పౌర్ణమి ఉత్సవాన్ని ఆధ్యాత్మికంగా ఘనంగా జరుపుకున్నారు.

## హైదర్‌గూడ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆందోళన



**రాజేంద్రనగర్, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం హైదర్‌గూడ డివిజన్‌లో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. చిట్టిగారి నరేందర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు షిఫ్ట్ నోటీసులు జారీ చేయడాన్ని, అలాగే కేసీఆర్‌పై జరుగుతున్న ఆరోపణలను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. రానున్న రోజుల్లో కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు కొనసాగితే తాము అగ్నిగుండంగా మారుతామని హెచ్చరించారు. కేసీఆర్ జోలికి వస్తే తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు, ధర్నాలు చేపడతామని, రాష్ట్రంలోని యువత మొత్తం కదలివచ్చి కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో హైదర్‌గూడ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించి ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు.

## చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



**రాజేంద్రనగర్, విశాలభారతి:** ఉదయం సుమారు 11.30 గంటలకు, ఖానాపూర్ నుండి శంకరపల్లి వైపు వెళ్లే మార్గంలో హెచ్ ఏ డబ్ల్యు టీ ఎదురుగా ఉన్న ఫార్మ్‌హౌస్ వెనుక భాగంలోని గండిపేట చెరువులో ఒక గుర్తుతెలియని మగ వ్యక్తి (వయస్సు సుమారు 50-60 సంవత్సరాలు) మృతదేహం లభ్యమైంది. అట్టి వ్యక్తి ప్రమాదవశాత్తు జారి పడిన అవకాశం ఉందని, లేదా మరేదైనా ప్రాంతంలో పడిపోయి గాలి వలన కొట్టుకువచ్చి ఉండవచ్చని, లేదా ఇతర కారణాలు ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. సంఘటనా స్థలంలో శవ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్ మార్చురీకి మృతదేహాన్ని తరలించి భద్రపరిచారు. మృతుడు వైట్ షర్ట్, బ్లూ కలర్ లోయర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఎవరైనా ఈ వ్యక్తిని గుర్తించినట్లయితే నార్సింగి పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని పోలీసులు కోరుతున్నారు.

## కాంగ్రెస్ పార్టీలోకి చేరిన గొట్టిమొక్కుల గ్రామ సర్పంచ్

**ఆహ్వానించిన స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్**



**వికారాబాద్, విశాలభారతి:** తెలంగాణ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ సమక్షంలో మండలంలోని గొట్టిమొక్కుల గ్రామ సర్పంచ్ సంగీత లింగంతో పాటు గ్రామానికి చెందిన ఐదుగురు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీలో అధికారికంగా చేరారు. ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి, రాష్ట్ర ప్రగతిని లక్ష్యంగా పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న విధానాలు, కార్యక్రమాలపై నమ్మకంతోనే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని ఈ సందర్భంగా కొత్తగా చేరిన నాయకులు పేర్కొన్నారు. ముఖ్యంగా శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ గారి నాయకత్వం, ప్రజలతో నేరుగా మమేకమై పనిచేసే విధానం తమకు ప్రేరణగా నిలిచిందని తెలిపారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి స్పీకర్, ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నాయకుల చేరికతో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి, కొత్తగా చేరిన ప్రజాప్రతినిధులను పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేదలు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందని ఆయన అన్నారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కొత్తగా చేరిన నాయకులు కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి, జాఫర్ తో పాటు మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆశీర్వదించండి అభివృద్ధి చేసి చూపిస్తా

**13వ వార్డు అభ్యర్థి గుమ్మాల శ్రావణి సీతారాంరెడ్డి ఇంటింటి ప్రచారం**



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు బీజేపీ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా గుమ్మల శ్రావణి సీతారాం రెడ్డి బరిలో నిలిచారు.నూతనంగా ఏర్పడిన మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ పార్టీ తరపున బలపరిచిన 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా గుమ్మల శ్రావణిసీతారాం రెడ్డి నీ ప్రజలందరూ ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించగలరని వారు కోరారు.గతంలో సైతం ప్రజలందరికీ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలందరికీ ఈ నిత్యం అందుబాటులో ఉంటూ ఏలాంటి సమస్యలు ఉన్న ప్రజలకు సహాయం ముందుకు వస్తున్నామని వారు తెలిపారు.13వ వార్డు కౌన్సిలర్ గా అవకాశం ఇవ్వండి ప్రజలకు మరింత సేవ చేసుకునే అవకాశం కనిపించాలని ఆయన ప్రజలను కోరారు. ప్రజల మద్దతుతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసే వారికి నిత్యం అందుబాటులో ఉంటానని వారు హామీ ఇచ్చారు.యువత చెడు మార్గం లో వెళ్లకుండా వారికి క్రీడలలో ప్రోత్సహించుకుంటూ విద్యా, వైద్యం, పారిశుద్ధం పై ప్రత్యేక దృష్టితో ముందుకు వెళ్తామని అదేవిధంగా మొయినాబాద్ మున్సిపాలిటీలో ఉన్న 13వ వార్డు ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తానని గుమ్మల శ్రావణి సీతారాం రెడ్డి హామీ ఇచ్చారు.

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు ఘన సన్మానం



**రాజేంద్రనగర్, విశాలభారతి:** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొత్వాల్గూడ మల్లన్న స్వామి ఆలయంలో నిర్వహించిన మల్లికార్జునస్వామి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో జరిగే జాతరలు, ఉత్సవాలు మన సంస్కృతి-సాంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. ఇటువంటి సంప్రదాయాలను కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అలాగే దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం తరఫున ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఆయన తెలిపారు. కల్యాణోత్సవం అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

# కేసీఆర్‌ని వేధిస్తున్న కాంగ్రెస్ సర్కార్

- కేసీఆర్ గారిని సిట్ విచారణ పేరుతో వేధించడం దుర్మార్గం
- మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి

**తాండూర్, విశాలభారతి:**



కేసీఆర్ పై కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తాండూరు పట్టణంలోని ఇందిరా చౌక్‌లో మానవహారంతో పాటు శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మానవత్వం లేకుండా 65 సంవత్సరాలు దాటిన కేసీఆర్ ని పట్టుకొని సిట్ విచారణ పేరుతో వేధించడం మూర్ఖత్వం కేసీఆర్ గారి కుటుంబ సభ్యులు కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావులను సిట్ విచారణ పేరిట ఇబ్బంది పెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క నీచమైన చర్య అని ఫోన్ ట్యాపింగ్ కి కేసీఆర్ గారికి ఎలాంటి సంబంధం లేకున్నా మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ సర్కార్ అవినీతి, అక్రమాలను దృష్టి మళ్లించడానికే ఈ సిట్ విచారణ అని కాంగ్రెస్ పాలన 25 మాసాలు 65 మోసాలుగా సాగుతున్నది. రాష్ట్రంలో స్కీముల పేరిట స్కామ్ లకు పాల్పడుతూ ప్రజల దృష్టిని మరల్చేందుకే రేవంత్ రెడ్డి సిట్ పేరిట డ్రామాలాడుతున్నారని క్యాలెండర్లు మారుతున్నాయి కానీ ఇప్పటి వరకు ఒక్క జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదు. నిరుద్యోగులను, రిటైర్డ్ ఉద్యోగులను, విద్యార్థులను, రైతులను మోసం చేస్తూ పాలన సాగిస్తున్నారు. అవీనీతి, కుంభకోణాలను బయటపెడుతున్నందుకు కేసులు, నోటీసులు, విచారణలు అంటూ ఇచ్చిన హామీలు ప్రకటించిన గ్యారెంటీలు అమలు చేయకుండా కాంగ్రెస్ సర్కార్ కాలం వెళ్లదీస్తున్నదని ప్రభుత్వం పై తీవ్రంగా మండిపడ్డారు.

## సత్తుపల్లి 14వ వార్డులో బిఆర్ఎస్ ప్రచార వేగం

- కోసంపూడి మహేష్ హాట్ క్యాంపెయిన్
- ఇంటింటా ప్రచారం – అభివృద్ధే అజెండా
- మహేష్‌కు ప్రజల బలమైన మద్దతు
- సండ్ర వెంకట వీరయ్య నాయకత్వంలో గెలుపుపై ధీమా

**సత్తుపల్లి, విశాలభారతి :**



ఖమ్మం జిల్లా సత్తుపల్లి మున్సిపాలిటీ 14వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ ప్రచారం రోజురోజుకీ మరింత ఉధృతంగా కొనసాగుతోంది. అభ్యర్థిగా బరిలో ఉన్న కోసంపూడి మహేష్ ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ, చిరునవ్వుతో ప్రజల మధ్య కలిసిపోతూ ఓటర్ల మనసు గెలుచుకుంటున్నారు. వార్డు సమగ్ర అభివృద్ధే తన ఏకైక లక్ష్యమని స్పష్టంగా చెబుతూ ప్రజల్లో నమ్మకం పెంచుతున్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ పాలనలో అమలైన అభివృద్ధి కార్యక్రమాలే ఈ ఎన్నికల్లో ప్రధాన అజెండాగా మారాయి. రహదారుల విస్తరణ, మౌలిక సదుపాయాల మెరుగుదల, సంక్షేమ పథకాల అమలులో బిఆర్ఎస్ ప్రభుత్వం చూపిన నిబద్ధతకు ప్రజల్లో విశ్వాసం మరింత బలపడిందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అదే అభివృద్ధి బాటలో 14వ వార్డును మరింత ముందుకు తీసుకెళ్లాలన్న సంకల్పంతో కోసంపూడి మహేష్ ప్రజల ముందుకు వస్తున్నారు. గతంలో తాను చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే తన విధానమే తన ప్రధాన బలమని కోసంపూడి మహేష్ స్పష్టం చేస్తున్నారు. చిన్న సమస్య అయినా సరే వెంటనే స్పందించి పరిష్కారం చూపిన నాయకుడిగా ఆయనకు వార్డులో ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచిన తన అనుభవమే ఈసారి ఓటుగా మారనుందనే విశ్వాసం వ్యక్తమవుతోంది. ‘నా ఓటు నీకే’ అంటూ ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతుండటంతో, సత్తుపల్లి 14వ వార్డులో బిఆర్ఎస్ గెలుపుపై ధీమా మరింత పెరుగుతోంది. మాటలకే పరిమితం కాకుండా చేతలతో సేవ చేసిన నాయకుడిగా కోసంపూడి మహేష్ ముందంజలో ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. సండ్ర వెంకట వీరయ్య నాయకత్వం, మార్గదర్శకత్వం, ఆశీస్సులతోనే ఈసారి మరోసారి ప్రజల ముందుకు వస్తున్నానని కోసంపూడి మహేష్ స్పష్టం చేస్తున్నారు. పార్టీ నాయకత్వం, కార్యకర్తల సమన్వయం, ప్రజల నమ్మకం కలిసొస్తే ఘన విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. సత్తుపల్లి రాజకీయ వేదికపై ఈసారి కూడా బిఆర్ఎస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రచారం కొనసాగుతోంది.

## ప్రతి డివిజన్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యం



**జక్కిడి ప్రభాకర్ రెడ్డి**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

ఎల్.బి నగర్ని యోజకవర్గంలో కుల, మత, కలుషిత రాజకీయాలకు తావులేని ప్రజాస్వామ్య పాలన కోసం కాంగ్రెస్ పార్టీ అగ్రభాగంలో నిలుస్తోందని టిపిసిసి ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. తల్లి పాలు తాగి రొమ్ముల మీద తన్నే స్వార్థ రాజకీయ నాయకులతో నియోజకవర్గానికి ఒరిగిందేమీ లేదని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు.ఎల్.బి నగర్ నియోజకవర్గం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో బిజెపి పార్టీకి చెందిన పోచబోయిన వినోద్ యాదవ్ వారి అనుచరులు బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై విసుగు చెంది, నేడు టిపిసిసి ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి,రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో అధికారికంగా చేరారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన వారికి కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు.అనంతరం మన్సూరాబాద్ చౌరస్తా నుంచి కామినేని వైయస్సార్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్ పార్టీ శక్తిని ప్రజలకు చాటిచెప్పారు. ఈ సందర్భంగా జక్కిడి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక పాలనతో బిజెపి పార్టీపై నమ్మకం కోల్పోయిన వినోద్ యాదవ్ లాంటి యువ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం సరైన నిర్ణయం. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వం, ప్రజా సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై చేరిన వారందరికీ హృదయపూర్వక అభినందనలు అని తెలిపారు.అలాగే ఎల్.బి నగర్ నియోజకవర్గం ప్రతి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోచబోయిన రవి యాదవ్, శంకర్ యాదవ్, వెంకుల యాదవ్, కృష్ణ యాదవ్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంట శ్రావణ్, బీసీ సెల్ నాయకులు రఘుపతి, సేవాదళ్ నాయకులు గిరి, కేకేసి రాష్ట్ర నాయకులు రాజశేఖర్ రెడ్డి కార్యకర్తలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్రంలో కాంగ్రెస్ జెండాను ఉండనీయం

**పల్లా సుందర్ రాంరెడ్డి**

**దేవరుప్పల విశాలభారతి:**

ఫోన్ టాపింగ్ విషయంలో బిఆర్ఎస్ అధినేత,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడంతో బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు.అందులో భాగంగానే దేవరుప్పుల మండలకేంద్రంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు,మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్ ఆధ్వర్యంలో జనగామసూర్యాపేట రహదారి చౌరస్థలో నల్ల జెండాలతో రోడ్డుపై బైఠాయించి ధర్నా,రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి పాల్గొని మాట్లాడుతూ సిట్ దర్యాప్తు పేరుతో కెసిఆర్ పై రాజకీయ కక్షసాధింపు జరుగుతోందని,కెసిఆర్ ను టచ్ చేస్తే తెలంగాణ రాష్ట్రమే అగ్ని గుండమే అవుతుందని,తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన కెసిఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడం సరికాదని,ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇస్తానన్నా ఆరు గ్యారెంటీలు అమలుచేసి చూపించండని,అవేమి అమలుచేయకనే మా నాయకుడు కేసీఆర్‌ను టార్గెట్ చేసుకొని సిట్ నోటీసులు ఇవ్వడం దుర్మార్గమైన చర్యని,పదిహేను రోజుల్లో రైతులకు రైతుబంధు రాకుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ జెండాను ఉండనీయమని



హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు గడ్డం రాజు,మాజీ ఎంపిపి కొల్లూరి సోమయ్య,మండల నాయకులు అనంతోజు కృష్ణ మూర్తి,ఏల సుందర్,వంగ అర్జున్,ఆయా గ్రామాల అధ్యక్షులు,ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు,యువజన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమం రద్దు

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**వికారాబాద్, విశాలభారతి:** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అమలులో ఉన్న ఎన్నికల ప్రవర్తనా నియమావళి కారణంగా, ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడదని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రజావాణి కార్యక్రమాన్ని మళ్లీ ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రజావాణి ద్వారా తమ సమస్యలు, ఫిర్యాదులు, దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చే ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. అలాగే, ఎన్నికల సమయంలో ప్రభుత్వ కార్యాలయాల కార్యకలాపాలు ఎన్నికల నిబంధనలకు లోబడి కొనసాగుతాయని, ప్రజలు అనవసరంగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ఇబ్బందులు పడకుండా ముందుగానే అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

## కార్పొరేటర్ అభ్యర్థిగా రంగు భారతి, బ్రహ్మం



**విశాలభారతి , గోదావరిఖని:** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 55వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా రంగు భారతీ, బ్రహ్మం బరిలో నిలిచారు. అనంతరం వారు మాట్లాడుతూ 55వ డివిజన్ ప్రజలు తనకు కుటుంబంలాంటిదని ప్రజల కష్టసుఖాల్లో, భాగస్వామిగా ఉండడమే మా జీవన విధానమని 55వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి రంగు భారతి, బ్రహ్మం తెలిపారు. మేము మాటలకే పరిమితం కాకుండా చూపించే సేవే తన రాజకీయ పునాది అని రంగు భారతి, బ్రమ్మం పేర్కొన్నారు. ముఖ్యంగా 55 డివిజన్ పరిధిలో ప్రధాన సమస్యలు, మౌలిక సదుపాయాలు కల్పించడం, తాగునీటి సమస్య, డివిజన్లో అండర్ గ్రౌండ్, డ్రైనేజీ, రోడ్ల అభివృద్ధి చేయడం, మహిళా సంక్షేమ, అభివృద్ధి పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సరిస్తానని అని తెలిపారు. అలాగే 55వ డివిజన్ అభివృద్ధిలో మహిళలకు యువతకు అవకాశం కల్పించడం, పేదల సమస్యలపై తక్షణం స్పందించడం తన ప్రధాన ప్రాధాన్యాలని వారు స్పష్టం చేశారు. డివిజన్లో ఏ సమస్య తలెత్తినా ప్రజల దగ్గరికి వెళ్లి సమస్యను విని పరిష్కారం చూపే విధంగా పనిచేస్తానని రంగు భారతీయ బ్రహ్మం అన్నారు. వృద్ధులు గౌరవంగా జీవించాలి, మహిళలు భద్రంగా ఉండాలి. యువతకు సరైన మార్గదర్శనం ఉండాలి పేద కుటుంబాలకు అండగా నిలవాలి, అనే ఆలోచనతోనే ప్రతిరోజు ప్రజల మధ్యనే ఉంటానని వారు హామీ ఇచ్చారు. రాబోయే రామగుండం కార్పొరేషన్ ఎన్నికల్లో 55వ డివిజన్ అభ్యర్థిగా తనను గెలిపించాలని, ప్రజల నమ్మకమే తన బలమని ప్రజల ఆశీస్సులు, సహకారంతో విజయం సాధించి డివిజన్ అభివృద్ధికి నిజాయితీగా పనిచేస్తానని రంగు భారతి, బ్రహ్మం మాటిచ్చారు.

## భగత్ రవిదాస్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, విశాలభారతి:** భగత్ రవిదాస్ 650వ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్భ గత్ రవిదాస్ 650వ జయంతి సందర్భంగా అత్తాపూర్‌లోని సిక్ చౌని వద్ద గల గురుద్వారా సాహెబ్‌లో నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురుద్వారాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, భగత్ రవిదాస్ ఒక గొప్ప సాధువు, సమాజ సంస్కర్తగా భక్తి ఉద్యమానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఈ పండుగను ఉత్తర భారతదేశంలో, ముఖ్యంగా పంజాబ్ రాష్ట్రంలో అత్యంత భక్తి శ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకుంటారని తెలిపారు. సమానత్వం, మానవత్వం, సౌభ్రాతృత్వం అనే విలువలను సమాజానికి చాటిన భగత్ రవిదాస్ బోధనలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. మనమందరం ఆయన భక్తి మార్గంలో, ఆయన అడుగుజాడల్లో నడుచుకుంటూ సమాజంలో శాంతి, ఐక్యతను పెంపొందించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గురుద్వారా కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## మున్సిపల్ చైర్మన్‌గా అనన్య ఘన విజయం సాధించాలి

**సమ్మక్క–సారక్కలకు మొక్కుకున్న ఉపసర్పంచ్ రత్నం**



**మర్పల్లి,విశాలభారతి :** మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూతురు అనన్య ఘన విజయం సాధించి మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నిక కావాలని ఆకాంక్షిస్తూ వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని సిరిపురం గ్రామ ఉపసర్పంచ్ రత్నం మేడారంలోని ప్రసిద్ధ సమ్మక్క-సారక్క వనదేవతలను దర్శించి ప్రత్యేక మొక్కులు చెల్లించారు. తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమైన సమ్మక్క-సారక్కలకు పూజలు నిర్వహించిన ఉపసర్పంచ్ రత్నం, ప్రజల ఆశీర్వాదంతో పాటు దైవ అనుగ్రహం ఉంటే అనన్యకు అపూర్వ విజయం తప్పదని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలు కోసం అనన్య నాయకత్వం అత్యంత అవసరమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.సమ్మక్క-సారక్కలు అనన్యకు విజయం ప్రసాదించాలని మొక్కుకున్నట్లు వెల్లడించిన రత్నం, మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజల సంక్షేమం, పారదర్శక పాలన కోసం ఈ విజయం కీలకమని అన్నారు. మేడారం దేవతల ఆశీస్సులతో ప్రజల తీర్పు అనన్యకు అనుకూలంగా వస్తుందనే ధీమాను వారు వ్యక్తం చేశారు.

## మొయినాబాద్ కాంగ్రెస్‌కు వీడ్కోలు పలికే పరిస్థితి?

**బీ–ఫాం పంపిణీపై సీనియర్ నేతల ఆవేదన**

**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తుపై అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. పార్టీ కోసం సంవత్సరాలుగా కష్టపడి పనిచేసిన కార్యకర్తలను పక్కనపెట్టి, కొత్తగా వచ్చిన వారికి డబ్బులు తీసుకుని బీ-ఫాంలు ఇస్తున్నారంటూ సీనియర్ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీని నమ్ముకుని పనిచేసిన వారిని గుర్తించకుండా, కేవలం ఆర్థిక లావాదేవీల ఆధారంగా అభ్యర్థిత్వాలు ఖరారు చేయడం వల్ల కిందిస్థాయి కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ పరిస్థితి కొనసాగితే కాంగ్రెస్ పార్టీకి మొయినాబాద్ మున్సిపాలిటీలో వీడ్కోలు తప్పదన్న అభిప్రాయం సీనియర్ నేతల నుంచి వినిపిస్తోంది. ఇటు ఎమ్మెల్యే వర్గం, అటు పార్టీ ఇన్‌చార్జీ వర్గాల మధ్య జరుగుతున్న అంతర్గత పోరులో కార్యకర్తలు నలిగిపోతున్నారని నాయకులు వాపోతున్నారు. ఎవరి మాట వినాలి? ఎవరి వెంట నడవాలి? అన్న అయోమయం కార్యకర్తల్లో నెలకొనడంతో పార్టీ బలహీనపడుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విశాల భారతి





## అందుకే అవకాశాలు

# తగ్గాయేమో?

గత ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో టాలీవుడ్‌లో భారీ విజయాన్ని అందుకున్నది తెలుగమ్మాయి ఐశ్వర్య రాజేష్. అయితే.. అంత విజయం తర్వాత కూడా అనుకున్న స్థాయిలో తనకు అవకాశాలు రాకపోవడం పట్ల ఇటీవల ఆమె స్పందించారు. 'నిజానికి 'సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత మంచి అవకాశాలు వస్తాయనుకున్నా. స్టార్ హీరోల సరసన కూడా నటించే ఛాన్సులు వస్తాయని ఆశించా. కానీ అలా జరగలేదు. తెలుగులో ఇప్పుడొస్తున్న హీరోయిన్ పాత్రలు ఐశ్వర్య చేయగలదా? అనే డౌట్ టాలీవుడ్ డైరెక్టర్లు, హీరోల్లో ఉందేమో. అందుకే అవకాశాలు తగ్గాయేమో. అయితే నావరకూ నాకొస్తున్న అవకాశాలతో సంతోషంగానే ఉన్నా. 'కాకా ముట్టై' సినిమాలో ఇద్దరు పిల్లల తల్లిగా నటించా. ఆ సినిమా టైమ్‌లో నా వయసు 21ఏళ్లు. ఇప్పటివరకూ నటిగా నా పాత్రలే నా గౌరవాన్ని పెంచాయి' అంటూ చెప్పుకొచ్చారు ఐశ్వర్యరాజేష్.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Madarapu Ashok. RNI No APTEL/2010/32877.